'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 79 | మంగళవారం | 3.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 79 | Tuesday | 3.11.2026 | Pages: 8 | Rate: 2

క్లీన్ సిటీ.. ట్రాఫిక్ ఫ్రీ లక్ష్యం!

- చెత్తకు చెక్.. ట్రాఫిక్‌కు బ్రేక్!
- హైదరాబాద్‌పై సీఎం రివ్యూ

హైదరాబాద్‌ను పరిశుభ్రమైన నగరంగా, ట్రాఫిక్ సమస్యలు లేని మహానగరంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో నగర పారిశుద్ధ్యం, రవాణా సమస్యలు, నీటి వినియోగంపై కీలక సూచనలు చేశారు. నగరంలోని ఏ ప్రాంతంలోనూ చెత్త పేరుకుపోకూడదని, ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ చెత్త సేకరించాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం చూపే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. నిర్మాణ వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని, పారిశ్రామిక ప్రాంతాల్లో చెత్త సేకరణకు ఐలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

(వివరాలు 2లో..)

ప్రతిభకు పదును.. ఒలింపిక్స్ లక్ష్యం

» ఖేలో ఇండియాకు శాశ్వత క్రీడా వసతులు

» అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు: సీఎం



అధికారమే లక్ష్యం



వివరాలు2లో..

- తెలంగాణలో కాంగ్రెస్‌ను పెకిలిస్తాం
- హోం మంత్రి యుద్ధం

ఓట్ల తొలగింపు నుంచి చొరబాటుదారుల వరకు.. ఈవీఎంల నుంచి ఎన్నికల విజయాల వరకు.. పార్లమెంట్ చర్చ నుంచి తెలంగాణ రాజకీయాల వరకు.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీపై విమర్శల వర్షం కురిపించారు. రాహుల్ గాంధీ నిర్వహించిన ఓటు బచావో ర్యాలీని చొరబాటుదారులను కాపాడే కార్యక్రమంగా అభివర్ణించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తొలగించిన ఓట్లలో మరణించినవారు, డూప్లికేట్ ఓట్లు, రెండు చోట్ల నమోదైన ఓట్లు ఉన్నాయని వివరించారు. ఈ అంశాలపై పార్లమెంట్‌లో బహిరంగ చర్చకు రావాలని రాహుల్‌కు సవాల్ విసిరారు. ఈవీఎంలపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను ప్రశ్నిస్తూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను ప్రస్తావించారు. ఇక తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు గుప్పిస్తూ, కాంగ్రెస్‌ను రాజకీయంగా ఓడించడమే లక్ష్యమని ప్రకటించారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బియ్యం వ్యాపారులపై రెయిడ్స్

25 కిలోల బస్తాపై 26 కిలోల ముద్ర!



- తూకంలో తేడాలు.. ధరల్లో బాదుడు!
- మరోవైపు పీడీఎస్ రైస్ పక్కదారి

25 కిలోల బస్తా.. 26 కిలోల లెక్క! ఇదేం బియ్యం వ్యాపారమో.. ఇదేం మాయాజాలమో! బస్తాలో బియ్యం 25 కిలోలే.. ముద్ర మాత్రం 26 కిలోలు! అంటే బియ్యం పెరగకపోయినా లెక్కల్లో మాత్రం కిలో పెరిగిందన్నమాట! తూకంలో తేడాలు, ధరల్లో బాదుడు.. మరోవైపు పేదల రేషన్ బియ్యానికీ పక్కదారి! హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అధికారుల తనిఖీలతో బియ్యం వ్యాపారుల అక్రమాల డొంక కదిలింది. అధిక ధరల వసూళ్లు, నకిలీ లేబుళ్లు, నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చాయి. బస్తాలో బియ్యం ఎంత? బిల్లులో లెక్క ఎంత? అన్న చందంగా సాగుతున్న ఈ దందాపై అధికారులు కొరడా ఝళిపించారు. (వివరాలు 2లో..)

పార్లమెంట్‌లో చర్చకు రండి

తేల్చుకుందాం.. రాహుల్‌కు షా సవాల్!

మాక్ పార్లమెంట్‌పై రాజకీయ వ్యంగ్యాస్త్రాలు

రాహుల్ గాంధీ నిర్వహించిన మాక్ పార్లమెంట్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నకిలీ పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా ఉండటం కంటే ప్రధానమంత్రి పాత్ర పోషిస్తే బాగుంటుందని ఎద్దేవా చేశారు. నిజమైన పార్లమెంట్‌లో ప్రధాని అయ్యే అవకాశం లేదని, కనీసం మాక్ పార్లమెంట్‌లోనైనా ఆ పదవిలో ఉంటే సోనియా గాంధీకి సంతోషంగా ఉంటుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీ దాని గౌరవాన్ని కాపాడటం లేదని విమర్శించారు. పార్లమెంట్‌ను సజావుగా సాగనివ్వకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈవీఎంలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), చొరబాటుదారుల అంశాలపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు సభలోనే సమాధానం చెబుతామని ప్రకటించారు. (వివరాలు 2లో..)

నకిలీ ఓట్లపై

అమిత్ షా విమర్శలు

తొలగించాలా వద్దా.. కాంగ్రెస్‌కు సూటి ప్రశ్న!

హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా గట్టి కౌంటర్ ఇచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్ర అనంతరం ప్రసంగించిన ఆయన.. రాహుల్ గాంధీ చెబుతున్న 13 కోట్ల ఓట్ల తొలగింపు అంశంపై ప్రశ్నలు సంధించారు. ఆ సంఖ్యలో 4.25 కోట్ల మందికి రెండు ప్రాంతాల్లో ఓట్లు నమోదయ్యాయని, మూడు కోట్ల మంది మరణించినప్పటికీ వారి పేర్లు జాబితాలో ఉన్నాయని చెప్పారు. మరో కోటి మందికి డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని, మూడు కోట్ల ఓట్లకు సంబంధించి అసలు ఓటర్లే లేరని అమిత్ షా పేర్కొన్నారు. (వివరాలు 2లో..)

పరనిందా ఆత్మస్తుతి

అమిత్ షా మాటవింటే అధోగతి

- విభజన హామీలు అమలు చేస్తే ఒట్టు
- తెలంగాణలో అధికారం కోసం బీజేపీ కనికట్టు
- దేశం అదానికి తాకట్టంటూ పొన్నం విసుర్లు



కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడానికే అమిత్ షా పర్యటన పరిమితమైందని, తెలంగాణకు కేంద్రం చేసిన సాయం గురించి మాత్రం మాట్లాడలేదని విమర్శించారు. తెలంగాణ నుంచి కేంద్రానికి వెళ్తున్న పన్నులెంత? తిరిగి రాష్ట్రానికి ఇస్తున్న నిధులెంత? అనే లెక్కలు చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల అమలు, తెలంగాణకు రావాల్సిన నిధులపై ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. (వివరాలు 2లో..)



పక్కా లోకల్..

5లో..

ఐటీకి సవాల్

సాఫ్ట్ వేర్ పోస్ట్.. స్థానికులే బెస్ట్

- కర్ణాటక సర్కారు వితండ వాదం
- కన్నడీగుల కొత్త నినాదం
- వార్నింగ్‌లతో యాజమాన్యాలకు టెన్షన్
- దేశ వ్యాప్తంగా మొదలైన అటెన్షన్

ఒకప్పుడు ప్రపంచ ఐటీ దిగ్గజాలకు స్వర్గధామం.. లక్షలాది మంది యువతకు ఉపాధి కల్పించిన బెంగళూరు ఇప్పుడు కొత్త సంక్షోభం దిశగా అడుగులు వేస్తోందా? కన్నడిగులకే ఉద్యోగాలివ్వాలన్న నినాదం ఐటీ కంపెనీల గేట్ల వరకు చేరింది. కర్ణాటక రక్షణ వేదిక కార్యకర్తలు నేరుగా సంస్థల కార్యాలయాల్లోకి వెళ్లి యాజమాన్యాలను నిలదీస్తున్నారు. ఉద్యోగుల లెక్కలు చెప్పండి.. నియామకాల్లో స్థానికుల వాటా వెల్లడించండి.. కన్నడ యువతకు అవకాశాలివ్వండి అంటూ వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రంగంలోకి దిగి కంపెనీల వద్దకు వెళ్లవద్దని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించినా ఉద్యమం ఆగడం లేదు. ఒకవైపు అంతర్జాతీయ ఐటీ రంగంలో లేఆఫ్‌ల కలవరం.. మరోవైపు స్థానిక ఉద్యోగాల కోసం ప్రాంతీయ ఉద్యమం.. ఇంకోవైపు పెట్టుబడులు, రియల్ ఎస్టేట్‌పై పడే ప్రభావం! ఈ పరిణామాలు బెంగళూరు భవిష్యత్తుపై కొత్త ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. స్థానికుల ఉపాధి హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యతే.. మరి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? కంపెనీల స్వేచ్ఛకు భరోసా ఎవరు ఇస్తారు? ఈ వివాదాన్ని బీజేపీ రాజకీయ అస్త్రంగా మలుచుకుంటుందా? కన్నడ ఉద్యోగాల నినాదం.. ఐటీ సామ్రాజ్యానికి సవాలుగా మారుతుందా? బెంగళూరులో మొదలైన ఈ చిచ్చు దేశవ్యాప్తంగా విస్తరిస్తుందా?

తెలంగాణ అభివృద్ధికి ఐఆర్‌సీ ప్రపంచ వేదిక!

» పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా 85వ సదస్సు

» రాష్ట్ర ప్రగతి పరిచయమే లక్ష్యం



తెలంగాణ అభివృద్ధిని అంతర్జాతీయ స్థాయిలో చాటడంతో పాటు భారీ పెట్టుబడులను ఆకర్షించే వేదికగా 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సదస్సును నిర్వహించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో జరిగే నాలుగు రోజుల సదస్సు ఏర్పాట్లపై సచివాలయంలో సుమారు మూడున్నర గంటల పాటు సమీక్ష నిర్వహించారు. (వివరాలు 2లో..)



ఇక అంతా డిజిటల్

» తెలంగాణ మార్కెట్లలో ఏఐ విప్లవం!

» అక్రమాలకు చెక్, రైతులకు గిట్టుబాటు ధర

తెలంగాణ వ్యవసాయ మార్కెట్లలో సాంకేతిక విప్లవానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. దేశంలోనే తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డిజిటల్ మార్కెట్ యార్డుల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. రైతు మార్కెట్‌లోకి అడుగుపెట్టినప్పటి నుంచి పంట విక్రయం, డబ్బుల చెల్లింపు, బయటకు వెళ్లే వరకు ప్రతి దశను ఒకే డిజిటల్ వ్యవస్థతో అనుసంధానించనున్నారు.



3లో..

ఢిల్లీలో డిష్యుం...డిష్యుం

మంత్రి Vs ఎమ్మెల్యే

- దామోదరతో లక్ష్మీకాంత్ లడాయి
- గాంధీ భవన్‌కు చేరిన పంచాయితీ



25 లక్షల ఎకరాల్లో నష్టం

ఎండిన పంటలు.. రైతుల కన్నీళ్లు పరిహారం చెల్లించాలి: హరీశ్‌రావు డిమాండ్

రాష్ట్రంలో కరువు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యమే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. సాగునీరు అందక రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. (వివరాలు 3లో..)



మెట్రో ఫేజ్-2కు నిధులు

రెండో దశకు రూ.150 కోట్లు విడుదల!

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ ప్రాజెక్టు కోసం రూ.150 కోట్ల నిధుల విడుదలకు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. 202627 బడ్జెట్‌లో మెట్రో ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించింది. ఇందులో తొలి విడతగా రూ.125 కోట్లు రుణ రూపంలో విడుదల చేసేందుకు ఆమోదం తెలిపింది. (2లో..)



7లో..

ట్రాఫిక్ చెడుగుడు...

పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌తోనే విరుగుడు

- హైదరాబాద్ ట్రాఫిక్‌తో ఫికర్
- చలాన్లు వేస్తున్నా జనం బేఫికర్
- ఫైన్ల వసూళ్లపైనే సర్కారు స్పెషల్ కేర్
- ప్రభుత్వ రూల్స్ పై పబ్లిక్ డోన్ట్ కేర్

రోడ్డుపైకి వస్తే ట్రాఫిక్ ఉచ్చు.. నిబంధన ఉల్లంఘిస్తే చలాన్ వేట.. వేల రూపాయల పన్నులు కడుతున్నా ప్రయాణానికి సరిపడా రహదారులు లేవు. గంటల తరబడి రోడ్లపైనే నిరీక్షిస్తున్నా ఉపశమనం లేదు. మరోవైపు హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో ఏళ్ల తరబడి విధించిన ట్రాఫిక్ చలాన్ల గణాంకాలు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే! ఆర్టీఐ ద్వారా బయటకొచ్చిన లెక్కలు జరిమానాల వసూళ్ల భారీ స్థాయిని వెల్లడిస్తుంటే.. ఆ డబ్బు ఎక్కడికి వెళ్తోంది? ఎంత ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది? ప్రజల ప్రయాణ సౌకర్యాల కోసం ఎంత ఖర్చవుతోంది? అన్న ప్రశ్నలకు మాత్రం స్పష్టమైన సమాధానాలు లేవు. పెండింగ్ చలాన్ల పేరుతో వాహనదారులను వేధించవద్దని హైకోర్టు ఆదేశాలు మరోవైపు చర్చనీయాంశమవుతున్నాయి. అసలు ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యమా? చలాన్ల వసూళ్లే ప్రధానమా? కొత్త రోడ్లే పరిష్కారమా? లేక డబుల్ డెక్కర్ బస్సులు, బలమైన ప్రజా రవాణాతో రద్దీకి చెక్ పెట్టవచ్చా? ప్రజల నుంచి జరిమానాలు వసూలు చేసే వ్యవస్థ.. ప్రజలకు జవాబుదారీగా ఉంటుందా? చలాన్లకు లెక్కలున్నాయి.. ప్రజల కష్టాలకు పరిష్కారం ఎక్కడ? ఈ ప్రశ్నల వెనుక ఉన్న అసలు కథనం లోపలి పేజీల్లో...



3లో..

ఎన్డీపీ విలీనానికి రంగం సిద్ధం

అమిత్ షాతో పార్టీ ముఖ్యుల భేటీ

రెండు వర్గాల కలయికపై ఊహాగానాలు

అధికారమే లక్ష్యం

తెలంగాణలో కాంగ్రెస్‌ను పెకిలిస్తాం
కాంగ్రెస్‌పై హోం మంత్రి యుద్ధం



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఎదుర్కొని, అధికారంలోకి రావడమే బీజేపీ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవినీతికి పాల్పడుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను కాంగ్రెస్ అధిష్ఠానానికి ఏటీఎంగా మార్చారని ఆరోపించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. తెలంగాణను అమ్ముకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేకపోతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిని అడ్డుకోవడం బీజేపీతోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తలకు పిలుపు.. కాంగ్రెస్‌పై పోరాటం

తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని అమిత్ షా పిలుపునిచ్చారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా అధికారానికి దూరంగా ఉందని గుర్తుచేశారు. తమిళనాడులో 64 ఏళ్లు, పశ్చిమ బెంగాల్‌లో 54 ఏళ్లు, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో 41 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని పేర్కొన్నారు. తెలంగాణలోనూ కాంగ్రెస్‌ను మూలాలతోసహా తొలగిస్తామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ మోదీ నాయకత్వాన్ని ఎదుర్కొనే స్థితిలో లేదని విమర్శించారు. మరోవైపు ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, త్రిపుల్ తలాక్ రద్దు, ఉగ్రవాదం, నక్సలిజంపై చర్యలను తమ ప్రభుత్వ విజయాలుగా ప్రస్తావించారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని రాజకీయంగా తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ భావిస్తోందని ఆయన ప్రసంగం స్పష్టం చేసింది. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో అధికారాన్ని సాధించేందుకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని కోరారు.

పార్లమెంట్‌లో చర్చకు రండి

- **తేల్చుకుందాం.. రాహుల్‌కు షా సవాల్!**
- **మాక్ పార్లమెంట్‌పై రాజకీయ వ్యంగ్యాస్త్రాలు**

ప్రత్యేక సమావేశానికి సిద్ధం.. బహిరంగ సవాల్

ఓట్ల చోరీ, ఈవీఎంలు, ఎస్ఐఆర్ అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉందని అమిత్ షా ప్రకటించారు. దమ్ముంటే రాహుల్ గాంధీ చర్చకు రావాలని హైదరాబాద్ వేదికగా సవాల్ విసిరారు. పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానం చెబుతారని అన్నారు. ఈవీఎంలు పనిచేయకపోతే తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎలా ఏర్పడిందని ప్రశ్నించారు. కేరళ, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్‌లలో కాంగ్రెస్ కూటములు అధికారంలోకి వచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. గెలిచినప్పుడు ప్రజల తీర్పుగా, ఓడినప్పుడు ఈవీఎంల తప్పిదంగా చెప్పడం సరైంది కాదన్నారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ చర్చకు వస్తారా? ప్రత్యేక సమావేశానికి కాంగ్రెస్ అంగీకరిస్తుందా? అన్నది ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

నకిలీ ఓట్లపై అమిత్ షా విమర్శలు

- **తొలగించాలా వద్దా.. కాంగ్రెస్‌కు సూటి ప్రశ్న!**
- **హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర**

ఇలాంటి ఓట్లను కూడా తొలగించకూడదా? రెండు చోట్ల ఓట్లు ఉన్నవారికి రెండుసార్లు ఓటు వేసే అవకాశం ఇవ్వాలా? మరణించిన వారి పేర్లను అలాగే కొనసాగించాలా? అని కాంగ్రెస్ పార్టీని సూటిగా ప్రశ్నించారు.

చొరబాటుదారుల ఓట్ల కోసమే వ్యతిరేకతా?

కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించడం వెనుక ఓటు బ్యాంకు రాజకీయాలు ఉన్నాయని అమిత్ షా ఆరోపించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ నిర్వహించిన ఓటు బచావో ర్యాలీని చొరబాటుదారులను కాపాడే ర్యాలీగా అభివర్ణించారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటుదారులను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. దేశ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు. 2014, 2019 ఎన్నికల్లో ఎస్ఐఆర్ లేకుండానే నరేంద్ర మోదీ విజయం సాధించారని గుర్తుచేస్తూ, తన విజయాలకు ప్రజల మద్దతే కారణమని చెప్పారు. ఎన్నికల జాబితాలో అక్రమ నమోదులపై కాంగ్రెస్‌కు నిజంగా అభ్యంతరమేమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ ఆరోపణలు, బీజేపీ సమర్థన మధ్య రాజకీయ వివాదం మరింత ముదురుతోంది.

క్లీన్ సిటీ.. ట్రాఫిక్ ఫ్రీ లక్ష్యం!

• చెత్తకు చెక్.. ట్రాఫిక్‌కు బ్రేక్! • హైదరాబాద్‌పై సీఎం రివ్యూ

తాగునీటికి బదులు గ్రీన్ వాటర్

నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, గార్డెనింగ్, ల్యాండ్‌స్కేపింగ్ అవసరాలకు తాగునీటిని వినియోగించకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని సీఎం సూచించారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో శుద్ధి చేసిన నీటిని గ్రీన్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని చెప్పారు. జలమండలి ఇప్పటికే 19 ఎస్టీపీల నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్లతో సేవలు ప్రారంభించిందని గుర్తుచేశారు. ఈ సేవలపైనిర్మాణసంస్థలు,పార్కుల నిర్వహణ బాధ్యతలు చేపట్టే సంస్థలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, ఇతర మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోనూ గ్రీన్ వాటర్ సరఫరాను విస్తరించాలని సూచించారు. దీనివల్ల తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు.

సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలవొద్దు

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలు నిరంతరాయంగా సాగేందుకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సిగ్నల్ ఫ్రీ ప్రయాణానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాల్లో సిగ్నళ్ల వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోకుండా చర్యలు



తీసుకోవాలని స్పష్టం చేశారు. నగర అభివృద్ధికి అనుగుణంగా రహదారులపై రద్దీని తగ్గించే మార్గాలను గుర్తించాలని సూచించారు.

అధికారులకు సీఎం దిశానిర్దేశం

పారిశుద్ధ్యం, నీటి నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ అంశాల్లో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం ప్రణాళికలు రూపొందించడమే కాకుండా క్షేత్రస్థాయిలో వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. హైదరాబాద్‌ను పరిశుభ్రతతో పాటు మెరుగైన రవాణా సౌకర్యాలు కలిగిన నగరంగా మార్చడమే లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన తదితర అధికారులు పాల్గొన్నారు.

పరనిందా ఆత్మస్తుతి

- **అమిత్ షా మాటవింటే అధోగతి**
- **విభజన హామీలు అమలు చేస్తే ఒట్టు**
- **తెలంగాణలో అధికారం కోసం బీజేపీ కనికట్టు**
- **దేశం అదానికి తాకట్టంటూ పాన్నం విసుర్లు**

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏటీఎంగా అభివర్ణించిన బీజేపీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపైనా అదే ఆరోపణలు చేస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులపై కేంద్రం తక్షణమే స్పందించి సహాయం అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలకు కేంద్రం చేస్తున్న మేలు ఏమిటో అమిత్ షా వివరించాలని కోరారు.

ఓట్ల తొలగింపుపై ఆధారాలేవి?

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ వ్యతిరేకతను అమిత్ షా తప్పుగా చిత్రీకరిస్తున్నారని పొన్నం అన్నారు. విదేశీయుల ఓట్లు తొలగించామని చెబుతున్న కేంద్రం.. ఎంతమంది విదేశీయులను గుర్తించింది? ఎంతమందిని వారి దేశాలకు పంపించింది? ఆధారాలేంటి? అని ప్రశ్నించారు. అర్హులైన ఓటర్ల పేర్లు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఓట్లు తొలగించడంపైనే కాంగ్రెస్ అభ్యంతరం చెబుతోందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పదిసార్లు ఓటర్ల జాబితా సవరణ చేపట్టిందని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యాలయాల నుంచి ఓట్ల తొలగింపు దరఖాస్తులు పంపిణీ అవుతున్నాయన్న ఆరోపణలపైనా అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌పై చర్చకు సిద్ధమని చెబుతున్న బీజేపీ పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి బహిరంగ చర్చ జరపాలని సవాల్ విసిరారు.

హామీలపై చర్చకు బీజేపీ సిద్ధమా?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొన్నం ప్రస్తావించారు. సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉద్యోగ నియామకాలు ప్రజలకు అందుతున్నాయని చెప్పారు. తమ ఆరు గ్యారంటీలపై చర్చకు సిద్ధమని, కేంద్రంలోని బీజేపీ ఇచ్చిన హామీలపైకూడా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రైతులకు నెలవారీ పెన్షన్లు, ఉచిత విద్యుత్, ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు, ధరల తగ్గింపు, లీటర్ పెట్రోల్ రూ.50కే అందిస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దేశంలో అంబానీ, అదానీ వంటి పారిశ్రామికవేత్తలకు



ప్రభుత్వ విధానాలు అనుకూలంగా ఉన్నాయని, దేశాన్ని అదానీకరణ చేస్తున్నారని ఆరోపించారు. పెరుగుతున్న ధరలు, మణిపూర్ పరిస్థితులు, అరుణాచల్ ప్రదేశ్ సమస్యలపై మాట్లాడకుండా స్థానిక రాజకీయాలకే పరిమితం కావడం ఏమిటని నిలదీశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

ప్రతిభకు పదును..ఒలింపిక్సే లక్ష్యం

ఖేలో ఇండియాకు శాశ్వత క్రీడా వసతులు
అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాట్లు: సీఎం

తెలంగాణను దేశంలోనే ప్రముఖ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు రాష్ట్రంలో జరగనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణలో ఎక్కడా నాణ్యత తగ్గకూడదని అధికారులను ఆదేశించారు. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు పతకాలు సాధించేలా అంతర్జాతీయ స్థాయి శిక్షణ, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ క్రీడా విధానం, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా యువతలోని ప్రతిభను వెలికితీస్తామని తెలిపారు. ఈ పోటీలు కేవలం ఒక క్రీడా కార్యక్రమంగా మిగిలిపోకుండా రాష్ట్ర క్రీడారంగ అభివృద్ధికి బలమైన పునాదిగా మారాలని ఆకాంక్షించారు.

పెట్టుబడుల సమ్మిట్ వనరులతో ఏర్పాట్లు

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కోసం చేస్తున్న ఏర్పాట్లకు సంబంధించిన వనరులను ఖేలో ఇండియా పోటీలకు కూడా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. రెండు కార్యక్రమాలకు సమాంతరంగా ఏర్పాట్లు చేస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. క్రీడా ప్రాంగణాలను అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి చేసి, పోటీలు ముగిసిన తర్వాత కూడా శాశ్వత క్రీడా వనరులుగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు గ్రూప్ 1 అధికారులు, ట్రైనీ అధికారులను నియమించాలని సూచించారు. క్రీడాకారులకు నాణ్యమైన ఆహారం, వసతి, రవాణా సౌకర్యాలు కల్పించాలని, ప్రతివారం పనులపురోగతిపైనివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. గతంలో నిర్మించిన క్రీడా మౌలిక వసతులు కొన్నేళ్లకే దెబ్బతిన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఈసారి అలాంటి పరిస్థితులు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రారంభ, ముగింపు వేడుకల్లో అనవసర ఆడంబరాలకు దూరంగా ఉండాలని సూచించారు.

ఆరు నగరాలు.. 20 వేదికల్లో పోటీలు

ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 7 వేలకు పైగా యువ క్రీడాకారులు, సుమారు 2 వేల మంది కోచ్‌లు, అధికారులు పాల్గొననున్నారు. హైదరాబాద్‌తో పాటు మరో ఐదు నగరాల్లోని 20 వేదికల్లో 27 రకాల క్రీడా పోటీలు, ఒక ప్రదర్శన పోటీ నిర్వహించనున్నారు. తెలంగాణ సంప్రదాయ క్రీడ అయిన కర్రసామును కూడా ఖేలో ఇండియా పోటీల్లో చేర్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రం తరపున పాల్గొనే క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన ఇచ్చేలా ప్రత్యేక శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తెలంగాణ అభివృద్ధికి ఐఆర్‌సీ ప్రపంచ వేదిక!

» పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా 85వ సదస్సు
» ప్రపంచానికి రాష్ట్ర ప్రగతి పరిచయమే లక్ష్యం

ఈ నెల 19న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సదస్సు ప్రారంభం కానుంది. కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల మంత్రులు, ఐఏఎస్ అధికారులు, అంతర్జాతీయ ప్రతినిధులు, ఇంజనీరింగ్ నిపుణులు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సూచించారు. రహదారుల నిర్మాణం, ఆధునిక సాంకేతికత, మౌలిక వసతుల అభివృద్ధిలో తెలంగాణ సాధిస్తున్న పురోగతిని ప్రపంచానికి పరిచయం చేయాలని స్పష్టం చేశారు.

తెలంగాణ పెవిలియన్‌తో సంస్కృతి వైభవం

సదస్సు ప్రాంగణంలో సుమారు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లతో పాటు ప్రత్యేకంగా తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, పర్యాటక ప్రాంతాలు, భారీ అభివృద్ధి ప్రాజెక్టులను ఇందులో ప్రదర్శించాలని చెప్పారు. ప్రతిరోజూ కనీసం గంటపాటు తెలంగాణ కళాకారుల ప్రదర్శనలు నిర్వహించాలని, అతిథులకు రాష్ట్ర ప్రత్యేకతను గుర్తుచేసే జ్ఞాపికలు అందించాలని ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు విమానాశ్రయాలు, మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను వినియోగించుకోవాలని తెలిపారు. డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఐఆర్‌సీని ప్రీసమ్మిట్‌గా మలచాలని ఆకాంక్షించారు. పెట్టుబడిదారులకు రాష్ట్రంలోని పారిశ్రామిక అవకాశాలు, రవాణా సదుపాయాలు, భవిష్యత్ ప్రాజెక్టులను వివరించి కొత్త పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలకు మార్గం వేయాలని చెప్పారు.

ఆస్పత్రుల నిర్మాణం వేగవంతం చేయాలి

ఐఆర్‌సీ ఏర్పాట్లతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, ఆస్పత్రుల నిర్మాణ పనుల పురోగతిని మంత్రి సమీక్షించారు. ఆల్వాల్ టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఈ ఏడాదిలోనే ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉస్మానియా ఆస్పత్రి, నిమ్స్ విస్తరణ, నూతన హైకోర్టు భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. హ్యామ్ విధానంలో చేపట్టిన రహదారుల పనులను కూడా నాణ్యతతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. సదస్సుకు వచ్చే ప్రతినిధులకు వసతి, రవాణా, ఆహారం, భద్రతలో ఇబ్బందులు లేకుండా తెలంగాణ ఆతిథ్య సంప్రదాయాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి ఐఆర్‌సీ వేదికగా కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సు తెలంగాణ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఇక అంతా డిజిటల్

తెలంగాణ మార్కెట్లలో ఏఐ విప్లవం!
అక్రమాలకు చెక్, రైతులకు గిట్టుబాటు ధర

ఈ మేరకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన సమీక్షలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. రైతు వివరాల నమోదు, పంటకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య, నాణ్యత పరీక్షలు, ఆన్‌లైన్ వేలం, వ్యాపారుల బిడ్లు, తూకం, బిల్లులు, మార్కెట్ ఛార్జీలు, చెల్లింపులన్నీ డిజిటల్ పద్ధతిలోనే జరగనున్నాయి. మధ్యవర్తుల జోక్యం, అక్రమాలకు అవకాశం లేకుండా పారదర్శక లావాదేవీలు నిర్వహించడం ఈ విధానం ప్రధాన ఉద్దేశం. రైతు అంగీకారం కోసం ఓటీపీ విధానాన్నికూడా అమలు చేయనున్నారు.

ప్రతి లావాదేవీపై ఏఐ నిఘా

మార్కెట్లలో జరిగే ప్రతి కార్యకలాపాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) రూపొందించాలని మంత్రి సూచించారు. పంటల రాక, ధరల వివరాలు, వ్యాపారుల బిడ్లు, వేలం ప్రక్రియలను ఎప్పటికప్పుడు నమోదు చేసి భద్రపరచనున్నారు. అవసరమైనప్పుడు పాత లావాదేవీలను పరిశీలించే అవకాశం కల్పిస్తారు. మార్కెట్ యార్డుల్లో సీసీ కెమెరాలు, డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా వివిధ మార్కెట్లలో పంటలకు లభిస్తున్న ధరలను ప్రదర్శించనున్నారు. అధికారుల బయోమెట్రిక్ హాజరును కూడా ఈ వ్యవస్థకు అనుసంధానించనున్నారు. తొలుత అధిక లావాదేవీలు జరిగే మార్కెట్లలో అమలు చేసి, క్రమంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయించారు. ఇతర రాష్ట్రాల్లోని డిజిటల్ మార్కెట్ విధానాలను అధ్యయనం చేసి మరింత మెరుగైన వ్యవస్థను రూపొందించాలని, ఐటీ శాఖతో సమన్వయం చేసుకొని వారం రోజుల్లో టెండర్లు



పిలవాలని తుమ్మల ఆదేశించారు.

కోహెడ మార్కెట్‌కు మార్చి గడువు

మరోవైపు హైదరాబాద్‌లో నిర్మిస్తున్న కోహెడ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనులపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. నిర్మాణ పనుల్లో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వచ్చే వారం రోజుల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. భూమి చదును విషయంలో హైదరాబాద్ గ్రోత్ కారిడార్ సంస్థ సూచించిన మార్పులకు ముఖ్యమంత్రి ఆమోదం తీసుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మొదటి దశ పనులు పూర్తి చేసి రైతులకు మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక సదుపాయాలు కల్పించి, పండ్ల విక్రయాలకు అనువైన సమీకృత మార్కెట్‌గా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మార్కెటింగ్ డైరెక్టర్ రాహుల్ రాజ్‌తో పాటు ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ విభాగం ప్రతినిధులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.



బియ్యం వ్యాపారులపై రెయిడ్స్

25 కిలోల బస్తాపై 26 కిలోల ముద్ర!

తూకంలో తేడాలు.. ధరల్లో బాదుడు!

మరోవైపు పీడీఎస్ రైస్ పక్కదారి

హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొన్నిదుకాణాల్లో 25 కిలోల బియ్యం ఉన్న బస్తాలపై 26 కిలోలుగా ముద్రలు వేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. తయారీదారులు ప్రకటించిన ధరలపై అదనపు స్టిక్కర్లు అంటించి ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లు తేల్చారు. తూకం యంత్రాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం కూడా బయటపడింది. కొనుగోలుదారుడికి తెలియకుండానే తూకం, ధర రెండింటిలోనూ మోసం జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.

రేషన్ బియ్యం పక్కదారి.. కేసులు

లైసెన్సులు లేకుండానే వ్యాపారాలు!
పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయి. ట్రేడ్, జీఎస్టీ, కార్మిక శాఖ, ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతులు లేకుండానే కొందరు వ్యాపారాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అక్రమాలకు సంబంధించిన ఆధారాలను ఫొటోలు, వీడియోల రూపంలో నమోదు చేశారు. సరూర్‌నగర్, జీడిమెట్ల, ఆల్వాల్ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు అందడంతో కేసులపై పోలీసులు చర్యలు ప్రారంభించారు. తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని పౌరసరఫరాల శాఖ ప్రకటించింది.

రూ.66 నుంచి రూ.79 వరకు ధరలు!

మరోవైపు హైదరాబాద్, మేడ్చల్ పట్టణ ప్రాంతాల్లో మూడు రకాల సన్నబియ్యానికి ప్రభుత్వం గరిష్ఠ చిల్లర ధరలు నిర్ణయించింది. అక్టోబర్ 31న ప్రకటించిన ఉత్తర్వుల ప్రకారం బీపీటీ/కేఎన్ఎం రకం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్/తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ/జేఎస్ఆర్ రకం రూ.79గా ఖరారు చేసింది. ఈ ధరలకు మించి విక్రయిస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఒకవైపు బస్తాపై కిలో అదనపు ముద్ర.. మరోవైపు ధరల్లో అదనపు వసూళ్లు.. ఇలాంటి మాయాజాలానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా అధికారులు నిఘా పెంచుతున్నారు. వ్యాపారులు నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు.



మెట్రో ఫేజ్-2కు నిధులు

రెండో దశకు రూ.150 కోట్లు విడుదల!

ఈ మేరకు జీవో ఆర్టీ నంబర్ 990 జారీ చేసింది. విడుదలైన నిధులను ఏయే పనులకు వినియోగిస్తున్నారో ప్రతి నెలా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది.

76.4 కిలోమీటర్ల మేర విస్తరణ

మరోవైపు మెట్రో రెండో దశకు కేంద్ర ప్రభుత్వం కూడా రూ.275 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు అందించిన సమాచారం పేర్కొంది. ఇందులో రూ.125 కోట్లు రుణ రూపంలో ఇవ్వనుంది. మొత్తం రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని విస్తరించేందుకు గతంలో అనుమతులు లభించాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధుల కేటాయింపులు జరగడంతో రెండో దశ ప్రాజెక్టుకు ఆర్థిక సహకారం అందుతోంది. నగరంలో పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలను తీర్చడంతో పాటు మెరుగైన ప్రజా రవాణా సదుపాయాలు కల్పించడంలో ఈ విస్తరణ కీలకం కానుంది.

బోర్డు స్థానంలో ప్రత్యేక అథారిటీ

- టీటీడీ పాలనకు ప్రత్యేక అధికార యంత్రాంగం
- ముగిసిన ట్రస్ట్ బోర్డు గడువు, ముగ్గురితో కమిటీ



తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలన బాధ్యతలను నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన స్పెసిఫైడ్ అథారిటీని నియమించింది. బీఆర్ నాయుడు నేతృత్వంలోని టీటీడీ పాలకమండలి పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం జీవో ఎంఎస్ నంబర్ 658 జారీ చేసింది. టీటీడీ కార్యనిర్వహణాధికారి ముద్దాడ రవిచంద్రను అథారిటీ చైర్మన్‌గా నియమించింది. ఆర్థిక శాఖ కార్యదర్శి వి. వినయ్‌చంద్, దేవాదాయ శాఖ కార్యదర్శి కె. కన్నబాబును సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. 2024 అక్టోబర్ 1న రెండేళ్ల కాలపరిమితితో ఏర్పాటైన పాలకమండలి గడువు పూర్తవడంతో ఈ మార్పు చోటు చేసుకుంది.

కొత్త బోర్డు వచ్చే వరకు ఇదే పాలన

కొత్త పాలకమండలి ఏర్పాటయ్యే వరకు టీటీడీ బోర్డుకు ఉన్న అధికారాలు, విధులు, బాధ్యతలను ఈ ప్రత్యేక అథారిటీ నిర్వహించనుంది. ఆలయ పరిపాలనతో పాటు బోర్డు పరిధిలోని అన్ని వ్యవహారాలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. అథారిటీ పదవీకాలం ఏడాది పాటు ఉంటుంది. అయితే, అంతకంటే ముందే కొత్త పాలకమండలిని ప్రభుత్వం నియమిస్తే అప్పటితో అథారిటీ బాధ్యతలు ముగుస్తాయి. అంటే ఏడాది గడువు లేదా కొత్త బోర్డు నియామకం.. ఈ రెండింటిలో ఏది ముందుగా జరిగితే అప్పటి వరకు మాత్రమే ప్రత్యేక అథారిటీ కొనసాగుతుంది. ప్రభుత్వ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చాయి.

ఢిల్లీలో డిష్యుం.. డిష్యుం

- మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే
- దామోదరతో లక్ష్మీకాంత్ లడాయి
- గాంధీ భవన్‌కు చేరిన పంచాయితీ



తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఢిల్లీ వేదికగా రచ్చకెక్కాయి. మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఆదివారం ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సంగారెడ్డి, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాలతో పాటు ఇతర పార్టీ పదవుల కేటాయింపులే వివాదానికి కారణంగా తెలుస్తోంది. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లిన సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. పార్టీ నేతల సమక్షంలోనే ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరగడం చర్చనీయాంశమైంది.

బూతులతో పాటు భౌతిక దాడి హెచ్చరికలు?

సంస్థాగత పదవుల విషయంలో మొదలైన వాదన తీవ్రరూపం దాల్చడంతో మంత్రి రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావును ఓ గదిలోకి తీసుకెళ్లి కొడతానంటూ బెదిరించినట్లు సమాచారం. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఈ పరిణామాన్ని ప్రత్యక్షంగా చూశారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ ఆరోపణలపై ఇరువైపుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

డీసీసీ పదవులే చిచ్చుకు కారణమా?

సంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడి నియామకంతో పాటు ఇతర నామినేటెడ్ పదవుల విషయంలో గత కొన్ని వారాలుగా ఇద్దరి మధ్య విభేదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ పదవుల ఎంపికలో ఎమ్మెల్యే జోక్యాన్ని మంత్రి వ్యతిరేకించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై లక్ష్మీకాంతరావు ఇప్పటికే టీపీసీసీ నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లు కథనం. దామోదర రాజనర్సింహపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐసీసీ నాయకత్వాన్ని కూడా ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లో పదవుల పంపకం ఎంతటి అంతర్గత పోరుకు దారితీస్తోందో ఈ ఘటన మరోసారి బయటపెట్టింది.

25 లక్షల ఎకరాల్లో నష్టం

- ఎండిన పంటలు.. రైతుల కన్నీళ్లు
- పరిహారం చెల్లించాలి: హరీశ్‌రావు



రాష్ట్రంలో కరువు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యమే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. సాగునీరు అందక రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సోమవారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో ఎండిపోయిన వరి పొలాలను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం రైతు సభలో మాట్లాడుతూ ఒక్క అల్వాలలోనే 250 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 24 నుంచి 25 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని పేర్కొన్నారు. గతంలో రెండు పంటలు పండిన కల్వకుర్తి ప్రాంతంలో ఇప్పుడు వానాకాలం పంటలే ఎండిపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

నీళ్లున్నా పంటలకు అందడం లేదు

శ్రీశైలానికి 221 టీఎంసీలు, జూరాలకు సుమారు 252 టీఎంసీల నీరు వచ్చినా వాటిని సరిగ్గా వినియోగించుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 50 టీఎంసీలు తీసుకునే అవకాశం ఉండగా కేవలం 18 టీఎంసీలే వినియోగించుకున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ తాత్కాలిక వాటాలో 34 నుంచి 41 శాతం నీటిని వినియోగించుకోగా, ఇప్పుడు 25 శాతానికి పడిపోయిందని పేర్కొన్నారు. కల్వకుర్తి ఐదు మోటార్లను 24 గంటలు నడపాలని, జూరాల నుంచి మరో 15 రోజులు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరురంగారెడ్డి కాలువల్లో అడ్డంకులు తొలగించి నార్లాపూర్ నుంచి కరివేన, వట్టెం రిజర్వాయర్ల వరకు నీటిని నింపాలని కోరారు.

రైతులకు పరిహారం.. కేంద్ర సాయం కావాలి

ఎండిపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని, యాసంగి రైతుబంధు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్లు, హార్వెస్టర్ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు పనిదినాలు పెంచాలని, రైతు కూలీలకు ప్రకటించిన రూ.12 వేల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందించాలని కోరారు. బత్తాయి, నిమ్మ, పామాయిల్, కూరగాయల రైతులకు నీరు, విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. తెలంగాణలో కరువు నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని పంపించి ఆర్థిక సాయం అందించాలని కోరారు. రైతులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో రైతుల సమస్యలను లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డితో పాటు పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్సీపీ విలీనానికి రంగం సిద్ధం

- అమిత్ షాతో పార్టీ ముఖ్యుల భేటీ
- రెండు వర్గాల కలయికపై ఊహాగానాలు



మహారాష్ట్ర రాజకీయాల్లో ఎన్సీపీ విలీనం అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ప్రతిపక్షాల ఓటర్ల జాబితా ఉద్యమంలో పాల్గొన్న మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో అజిత్ పవార్ వర్గానికి చెందిన నేతలు సమావేశమయ్యారు. ఎన్సీపీలో అంతర్గత విభేదాలను పరిష్కరించుకుని పార్టీని బలోపేతం చేయాలని అమిత్ షా, బీజేపీ నాయకత్వం సూచించినట్లు సమాచారం. అజిత్ పవార్ లేని పరిస్థితుల్లో పార్టీ భవిష్యత్తు, నాయకత్వ నిర్వహణపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ భేటీతో శరద్ పవార్, అజిత్ పవార్ వర్గాలు తిరిగి ఒక్కటవుతాయనే ప్రచారం మొదలైంది. అయితే రెండు వర్గాల విలీనంపై వస్తున్న ఊహాగానాలను సంబంధిత వర్గాలు తోసిపుచ్చినట్లు సమాచారం.

విలీనానికి నేతల విముఖత.. సునేత్ర కీలక భేటీ

అమిత్ షాతో సమావేశంలో ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే, ధనంజయ్ ముండే, ఛగన్ భుజ్‌బల్ పాల్గొన్నారు. సునేత్ర పవార్, పార్థ్ పవార్ మాత్రం ఈ బృందంలో లేరు. ఎన్సీపీ రెండు వర్గాల విలీనానికి ఇరు పక్షాల్లోనూ పెద్దగా మద్దతు లేదని తెలుస్తోంది. మరోవైపు సునేత్ర పవార్ ముంబైలోని తన నివాసంలో పార్టీ నేతలతో కోర్ కమిటీ సమావేశం నిర్వహించి, విలీన ప్రతిపాదనను వ్యతిరేకించే అంశంపై చర్చించినట్లు సమాచారం. రేపు సాయంత్రం 7 గంటలకు దేవగిరి నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలతో అత్యవసర సమావేశానికి ఆమె పిలుపునిచ్చారు. ఎంతమంది ఎమ్మెల్యేలు హాజరవుతారన్నది పార్టీ నాయకత్వానికి కీలకంగా మారింది. విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని రాజకీయ కోణంలో చూడవద్దని, ఎన్సీపీ మహాయుతి కూటమిలో సునేత్ర పవార్ నాయకత్వంలో ఐక్యంగా ఉందని పార్టీ అధికార ప్రతినిధి ఉమేశ్ పాటిల్ స్పష్టం చేశారు. గతంలో అజిత్ పవార్ ఫిబ్రవరి 12న విలీన ప్రకటన చేస్తారని ప్రచారం జరిగినా, ఆయన మరణంతో ఆ ప్రయత్నాలకు తెరపడిందని సుప్రియా సూలే వ్యాఖ్యానించారు.

గ్రీన్ సిగ్నల్

- అమరావతిలో ఐకానిక్ టవర్ల పనులు వేగవంతం
- రూ.768.89 కోట్లతో షాపూర్జీ పల్లోంజీకి కాంట్రాక్టు



అమరావతిలో ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థకు కొత్త రూపునిచ్చే ఐకానిక్ టవర్ల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. సచివాలయం, ప్రభుత్వ శాఖల అధిపతుల కార్యాలయాల కోసం నిర్మిస్తున్న టవర్లు 1, 2, 3, 4లకు సంబంధించి కీలకమైన మౌలిక సదుపాయాల పనులకు అనుమతులు మంజూరు చేసింది. ముఖ్యంగా విద్యుత్, అగ్నిమాపక భద్రత, ఏసీ, ప్లంబింగ్ వంటి హైసైడ్ ఎంఈపీ పనులను ఒకేసారి చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి కాంట్రాక్టును ఖరారు చేసింది. రూ.768.89 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులను ప్రముఖ నిర్మాణ సంస్థ షాపూర్జీ పల్లోంజీ దక్కించుకుంది.

విద్యుత్ నుంచి ఏసీ వరకు అన్ని ఏర్పాట్లు

ఈ ప్రాజెక్టులో భాగంగా నాలుగు టవర్లలో పూర్తిస్థాయి విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్, అగ్నిమాపక భద్రతా పరికరాలు, లిఫ్టులు, ప్లంబింగ్ వ్యవస్థలను నిర్మాణ సంస్థ సిద్ధం చేయనుంది. భవనాల్లో పనిచేసే ఉద్యోగులు, అధికారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశం. టవర్లలో అంతర్గత మౌలిక వసతులతో పాటు రూఫ్‌టాప్ పనులు కూడా పూర్తిచేయాల్సి ఉంది. ఈ ఏర్పాట్లతో ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు ఒకే సముదాయంలో అందుబాటులోకి రానున్నాయి.

ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాలు

అమరావతిలోని పలవాగు ప్రాంతంలో సుమారు 32 ఎకరాల్లో ఐదు భారీ టవర్లతో ఈ సమగ్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రాష్ట్ర సచివాలయం, సాధారణ పరిపాలనా శాఖతో పాటు సుమారు 145 ప్రభుత్వ శాఖాధిపతుల కార్యాలయాలు కొలువుదీరనున్నాయి. ప్రధాన పరిపాలనా టవర్ 49 అంతస్తులతో, మిగిలిన నాలుగు హెచ్ఓడీ టవర్లు 39 అంతస్తులతో రూపుదిద్దుకుంటున్నాయి. నిర్మాణ పనులతో పాటు ఎంఈపీ పనులకు కూడా అనుమతులు రావడంతో ప్రాజెక్టు తదుపరి దశకు చేరింది. ప్రభుత్వ శాఖలన్నింటినీ ఒకే ప్రాంగణంలోకి తీసుకురావడం, పరిపాలనను మరింత సమన్వయంతో నిర్వహించడం ప్రభుత్వ లక్ష్యం. నిర్ణీత గడువులో పనులు పూర్తిచేసి టవర్లను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.

ఉన్మాదికి కాలు తొలగించాల్సిందేనా?

- పోలీసుల కాల్పులతో తీవ్ర గాయాలు
- రక్తప్రసరణ ఆగిపోవడంతో ప్రమాదం



అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై కిరాతకంగా దాడిచేసిన నిందితుడికి కుడికాలు తొలగించే పరిస్థితి ఏర్పడింది. ఆత్మకూరు అటవీ ప్రాంతంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌పై దాడికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపారు. అతడి కాళ్లలో ఆరు బుల్లెట్లు తగిలాయి. తీవ్రంగా గాయపడిన కుడికాలికి రక్తప్రసరణ సరిగా జరగకపోవడంతో గ్యాంగ్రీన్ ఏర్పడింది. అంటే రక్తం అందక కాలిలోని కణజాలం చనిపోవడం ప్రారంభమైంది. ఇన్ఫెక్షన్ వ్యాపించే ప్రమాదం ఉందని వైద్యులు అందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోకాలి కింద భాగం తొలగించే అవకాశం

అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో నిందితుడికి చికిత్స కొనసాగుతోంది. కుడికాలిని మోకాలి కింద నుంచి తొలగించాల్సి రావచ్చని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి. మల్లీశ్వరి తెలిపారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ కాలికి తక్షణ శస్త్రచికిత్స అవసరమని చెప్పారు. ఇప్పటికే మూడు యూనిట్ల రక్తం ఎక్కించారు. మత్తు పదార్థాలు తీసుకున్నాడా అనే అనుమానంతో నమూనాలను తిరుపతి ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించారు. సోమవారం తెల్లవారుజాము వరకు మత్తులో ఉన్న నిందితుడు, తర్వాత భయంతో ఏడ్చినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. భద్రత కోసం ప్రత్యేక వార్డుకు తరలించారు.

కోలుకుంటున్న బాలిక.. పాఠశాలలో భయం

మరోవైపు బెంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థిని ఆరోగ్యం మెరుగుపడుతోంది. స్పృహలోకి వచ్చిన బాలిక తల్లితో మాట్లాడింది. ఆమె మెదడు, గుండె వంటి కీలక అవయవాలకు ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. స్నేహితురాలిని కాపాడేందుకు ప్రయత్నించి గాయపడిన మరో విద్యార్థినికి కూడా చికిత్స కొనసాగుతోంది. మంత్రి నారా లోకేశ్ బాలిక ధైర్యాన్ని ప్రశంసించారు. వైఎస్ జగన్ బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఘటన భయంతో 350 మంది విద్యార్థులున్న పాఠశాలకు సోమవారం కేవలం పదిమందే హాజరయ్యారు.

హెచ్‌పీసీఎల్ రిఫైనరీలో భారీ అగ్నిప్రమాదం

- పిచ్ టవర్‌లో మంటలు.. తప్పిన ప్రాణనష్టం
- కొత్త యూనిట్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు



విశాఖపట్నంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) రిఫైనరీలో సోమవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన రెసిడ్యూ అప్‌గ్రేడేషన్ ఫెసిలిటీ (ఆర్‌యూఎఫ్)లోని పిచ్ టవర్ పద్ద మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో పాటు దట్టమైన నల్లటి పొగ ఆకాశాన్ని కమ్ముకోవడంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే హెచ్‌పీసీఎల్ అగ్నిమాపక, భద్రతా విభాగం సొంత ఫైర్ ఇంజిన్లతో రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చింది. బయటి నుంచి ఫైర్ ఇంజిన్లను రప్పించాల్సిన అవసరం రాలేదని మల్కాపురం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఈ. నరసింహారావు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదని స్పష్టం చేశారు. భద్రతా వ్యవస్థలు వెంటనే స్పందించడంతో విధుల్లో ఉన్న సిబ్బందిని సురక్షితంగా బయటకు తరలించారు.

నష్టంపై అంచనా.. ప్రమాదంపై విచారణ

ఆర్‌యూఎఫ్ యూనిట్‌లో భారీ వాక్యూమ్ రెసిడ్యూ ఆయిల్‌ను డీజిల్, పెట్రోల్ వంటి విలువైన ఇంధనాలుగా మారుస్తారు. అధిక ఉష్ణోగ్రతలు, పిచ్ పదార్థం కారణంగా ప్రమాద సమయంలో దట్టమైన నల్లటి పొగ వెలువడినట్లు అధికారులు తెలిపారు. మంటలు పక్కనున్న ఇతర యూనిట్లకు వ్యాపించకుండా సిబ్బంది చర్యలు తీసుకున్నారు. అయితే పిచ్ యూనిట్‌లో ఆస్తి నష్టం గణనీయంగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి అసలు కారణాలను గుర్తించేందుకు సాంకేతిక నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపడతామని హెచ్‌పీసీఎల్ అధికారులు వెల్లడించారు. మరోవైపు రిఫైనరీలోని ప్రధాన ఉత్పత్తి విభాగాలు యథావిధిగా పనిచేస్తున్నాయని, ఇంధన సరఫరాకు ఎలాంటి అంతరాయం ఉండదని సంస్థ స్పష్టం చేసింది.

గూగుల్ డేటా.. చెప్పాలి టాటా

- వివాదంలో విశాఖ డేటా సెంటర్
- పర్యావరణంపై కాంగ్రెస్ లీగల్ వార్
- అభివృద్ధి ముసుగులో విధ్వంసం
- అడ్డుకుంటామని హస్తం పార్టీ పంతం

విశాఖలో భారీ డేటా సెంటర్ ఏర్పాటు ఇప్పుడు కేవలం పారిశ్రామిక ప్రాజెక్టు వివాదంగా మిగలలేదు. నగరానికి తాగునీరు అందించే ముడసర్లోవ జలాశయం, కంబాలకొండ అటవీ ప్రాంతం, భూగర్భజలాలు, విద్యుత్ అవసరాలు, స్థానిక ప్రజల భవిష్యత్తు.. ఇలా అనేక అంశాలు చర్చకు వస్తున్నాయి. ఒకవైపు పెట్టుబడులు, ఉపాధి, సాంకేతిక అభివృద్ధి పేరుతో ప్రభుత్వం ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తుంటే.. మరోవైపు పర్యావరణ అనుమతులు సరైన విధానంలో ఇచ్చారా? ప్రజల అవసరాలకు ముప్పు వాటిల్లుతుందా? అనే ప్రశ్నలతో వివిధ సంస్థలు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నాయి. హైకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునల్ నుంచి ఇప్పుడు సుప్రీంకోర్టు వరకు ఈ వివాదం విస్తరిస్తోంది. అసలు ఈ ప్రాజెక్టు ఏమిటి? అభ్యంతరాలేమిటి? న్యాయపోరాటం ఎందుకు మొదలైంది?



డేటా సెంటర్ అంటే వేల సంఖ్యలో కంప్యూటర్ సర్వర్లు నిరంతరం పనిచేసే భారీ కేంద్రం. గూగుల్ వంటి సంస్థలు క్లౌడ్ సేవలు, ఏఐ, డిజిటల్ సమాచార నిల్వ కోసం వీటిని వినియోగిస్తాయి. అయితే సర్వర్లు నిరంతరం పనిచేయడంతో అధిక వేడి ఉత్పత్తి అవుతుంది. వాటిని చల్లబరిచేందుకు శీతలీకరణ వ్యవస్థలు అవసరం. ఇందుకు విద్యుత్‌తో పాటు నీరు కూడా కీలకం. విశాఖ పరిసరాల్లో ప్రతిపాదించిన డేటా సెంటర్ ప్రాజెక్టుల్లో అదానీ ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలోని రూ.17,700 కోట్ల విలువైన హైపర్‌స్కేల్ ప్రాజెక్టు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. అదవివరం, ముడసర్లోవ పరిధిలో 601.4 ఎకరాల్లో 512 మెగావాట్ల సామర్థ్యంతో దీనిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రాజెక్టు స్థలం కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యానికి సుమారు 750 మీటర్లు, దాని పర్యావరణ సున్నిత ప్రాంతానికి 470 మీటర్ల దూరంలో ఉందని పిటిషనర్లు చెబుతున్నారు. ముడసర్లోవ జలాశయం కూడా సమీపంలోనే ఉండటంతో నీటి వనరులపై ప్రభావం ఉంటుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

కోర్టుల మెట్లెక్కిన వివాదం.. ఎక్కడెక్కడ కేసులు?

ఈ ప్రాజెక్టుపై న్యాయపోరాటం ఒక్కచోటే పరిమితం కాలేదు. జల బిరాదరి జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ ఏపీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సింహాచలం దేవస్థానానికి చెందిన 160 ఎకరాల భూమిని ప్రాజెక్టుకు కేటాయించడాన్ని, పర్యావరణ అనుమతులను ఆయన ప్రశ్నించారు. అక్టోబర్ 6న హైకోర్టు నిర్మాణ పనులను కొనసాగించేందుకు అనుమతించినప్పటికీ, తుది తీర్పునకు లోబడి, డెవలపర్లు తమ సొంత రిస్క్‌తోనే పనులు చేపట్టాలని స్పష్టం చేసింది. మరోవైపు డాక్టర్ బొడ్డు గంగారావు పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ని ఆశ్రయించారు. హెచ్ఆర్ఎఫ్ (హ్యూమన్ రైట్స్ ఫోరం) కూడా పర్యావరణ అనుమతులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సంబంధిత వేదికల్లో ఫిర్యాదులు, అభ్యర్థనలు చేసింది. తాజాగా నవంబర్ 2న ఏపీసీసీ ఉపాధ్యక్షుడు వేగి వెంకటేశ్, విశాఖ కాంగ్రెస్ అధ్యక్షురాలు హసీనా వర్మ, సీనియర్ న్యాయవాది కృష్ణ సుప్రీంకోర్టులో న్యాయపోరాటం ప్రారంభించేందుకు ఢిల్లీ వెళ్లారు. అనుమతుల సమగ్ర సమీక్షతో పాటు నిర్మాణాలపై స్టే కోరేందుకు పిటిషన్ సిద్ధం చేస్తున్నట్లు కాంగ్రెస్ నేతలు ప్రకటించారు.

ఎన్‌జీటీ ఎందుకు జోక్యం చేసుకుంది?

ఈ వివాదంలో కీలక పరిణామం అక్టోబర్ 27న ఎన్‌జీటీలో చోటుచేసుకుంది. డేటా సెంటర్ వంటి భారీ ప్రాజెక్టును సాధారణ భవన నిర్మాణాల కేటగిరీ కింద పరిశీలించి పర్యావరణ అనుమతులు ఇచ్చారా? అనే అంశంపై ట్రిబ్యునల్ ప్రశ్నలు లేవనెత్తింది. ఈ అనుమతులు పర్యావరణ ప్రభావ అంచనా నిబంధనల్లోని 8(ఎ) విభాగం, బీ2 కేటగిరీ కింద మంజూరయ్యాయని పేర్కొంది. భారీ డేటా సెంటర్‌కు అవసరమైన ప్రత్యేక పర్యావరణ ప్రమాణాలు, ప్రజాభిప్రాయ సేకరణ, ప్రాంతానికి సంబంధించిన పర్యావరణ పరిస్థితులు తగినంతగా పరిగణనలోకి వచ్చాయా అనే సందేహాలను వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టు అనుమతుల్లో ఏటా ఆరు టన్నుల ఈవ్యర్థాలు, 200 టన్నుల బ్యాటరీ వ్యర్థాలు, 8,000 లీటర్ల వాడిన చమురు వ్యర్థాలు ఉత్పత్తి అవుతాయని పేర్కొన్న అంశాలనూ ప్రస్తావించింది. డేటా సెంటర్లకు ప్రత్యేక పర్యావరణ కేటగిరీ లేకపోవడంపై కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖను కూడా కేసులో ప్రతివాదిగా చేర్చింది. కేంద్రం నవంబర్ 20లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 7కు వాయిదా వేసింది. అయితే ఈ దశలో నిర్మాణాలపై స్టే విధించలేదు.

నీళ్లు, విద్యుత్, పర్యావరణం.. నిపుణుల హెచ్చరికలేమిటి?

డేటా సెంటర్లపై ఆందోళన కేవలం రాజకీయ పార్టీలకే పరిమితం కాలేదు. పర్యావరణ సంస్థలు, స్థానిక సంఘాలు నీటి లభ్యత, విద్యుత్ వినియోగం, వ్యర్థాల నిర్వహణ, కొండలు, జలాశయాల పరిరక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ముడసర్లోవ జలాశయం విశాఖకు తాగునీటి వనరు కావడంతో దానికి నీటిని చేరవేసే వాగులు, సహజ ప్రవాహాలు దెబ్బతింటాయా అన్నది ప్రధాన సందేహం. మరోవైపు ప్రభుత్వం తరపున పర్యావరణ అనుమతులు పరిశీలన తర్వాతే ఇచ్చామని, అవసరమైన రక్షణ చర్యలు తీసుకుంటామని వాదనలు వినిపించాయి. ఈ చర్చలో అక్టోబర్ 14న నీతి ఆయోగ్ విడుదల చేసిన డేటా సెంటర్ ఎవాల్యుయేషన్ ఫ్రేమ్‌వర్క్ ప్రాధాన్యం సంతరించుకుంది. విద్యుత్ సామర్థ్యం, నీటి వినియోగం, శీతలీకరణ, పర్యావరణ అనుకూల ప్రాంతాల ఎంపిక, ఆర్థిక ప్రయోజనాలు, పాలనా పర్యవేక్షణ.. ఐదు అంశాల ఆధారంగా ప్రాజెక్టులను పరిశీలించాలని అందులో సూచించింది. ప్రజల నీటి సరఫరాపై ప్రభావం, భూగర్భజలాల పరిస్థితి, పునరుత్పాదక విద్యుత్, వ్యర్థాల నిర్వహణను కూడా అంచనా వేయాలని పేర్కొంది. ఈ మార్గదర్శకాలు రాష్ట్రంలో ఇప్పటికే మంజూరైన అనుమతులకు ఎలా పరిస్తాయి? వాటి ప్రకారం ప్రాజెక్టును తిరిగి సమీక్షించాలా? అనేది ఇప్పుడు చర్చనీయాంశం.

– కేసానపల్లి కోటేశ్వరరావు,



కడప క్రికెట్ చరిత్రలో మరో మైలురాయి

ప్రొద్దుటూరు కుర్రాడికి ఆంధ్ర జట్టులో చోటు!

కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన యువ క్రికెటర్ ధ్రువ కుమార్ రెడ్డి అరుదైన ఘనత సాధించాడు. 2026 సీజన్‌లో ఆంధ్ర రంజీ ట్రోఫీ జట్టుకు ఎంపికై తన కలను నిజం చేసుకున్నాడు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ధ్రువ, క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని లక్ష్యంగా మార్చుకుని నిరంతరం శ్రమించాడు. జిల్లా స్థాయి పోటీల నుంచి జోనల్ మ్యాచ్‌ల వరకు ప్రతిభ చూపి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించాడు. ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మకమైన రంజీ వేదికపై ఆడే అవకాశం దక్కించుకున్నాడు. ఇది అతడి వ్యక్తిగత విజయమే కాదు.. కడప జిల్లా క్రికెట్‌కు గర్వకారణం.

కుటుంబ ప్రోత్సాహం.. గురువుల శిక్షణ

ధ్రువ తండ్రి లక్ష్మి రెడ్డి హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా, తల్లి శారదాదేవి గృహిణి. చిన్నతనంలోనే కుమారుడి క్రికెట్ ఆసక్తిని గుర్తించిన తండ్రి అతడిని ప్రోత్సహించారు. ప్రొద్దుటూరులోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ యూత్ క్రికెట్ క్లబ్‌లో అతడి ప్రయాణం మొదలైంది. కోచ్ అశోక్ వద్ద బ్యాటింగ్ మెళకువలు నేర్చుకున్నాడు. శ్రీకాంత్ రెడ్డి ప్రోత్సాహం, మార్గదర్శకత్వం కూడా అతడి ఎదుగుదలకు తోడయ్యాయి. కుటుంబ అండ, గురువుల శిక్షణతో ధ్రువ ఆటలో రాటుదేలాడు.

2,500 పరుగులతో సెలెక్టర్ల దృష్టికి

2025-26 సీజన్‌లో ధ్రువ బ్యాట్ నుంచి పరుగుల ప్రవాహం కొనసాగింది. వివిధ టోర్నీలు, ఫార్మాట్లలో కలిపి సుమారు 2,500 పరుగులు సాధించాడు. సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీడే పోటీల్లో కర్నూలుపై 176, నెల్లూరుపై 160 పరుగులు చేశాడు. సీనియర్ జోన్స్ ప్రాబబుల్స్‌లో సెక్రటరీ XIపై 202, టీమ్ Cపై 227 పరుగులతో అదరగొట్టాడు. సీనియర్ వన్డే ప్రాబబుల్స్‌లో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్‌పై 144, రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్‌పై 176 పరుగులు సాధించాడు. మధ్యప్రదేశ్‌పై డాక్టర్ తిమ్మప్ప మెమోరియల్ టోర్నీలో సెంచరీ, హైదరాబాద్‌పై ఎమర్జింగ్ ప్రీమియర్ లీగ్‌లో 127 పరుగులు నమోదు చేశాడు.

రంజీ జెర్సీతో కొత్త లక్ష్యం

వరుసగా భారీ స్కోర్లు సాధిస్తూ నిలకడైన ఆటగాడిగా గుర్తింపు పొందిన ధ్రువ ప్రదర్శనలు సెలెక్టర్లను ఆకట్టుకున్నాయి. ఫలితంగా ఆంధ్ర రంజీ జట్టులో చోటు దక్కింది. క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ కడప జిల్లాకు కూడా ఇది గర్వకారణం. తండ్రి లక్ష్మి రెడ్డి, తల్లి శారదాదేవి ఆశలు, కోచ్ అశోక్ శిక్షణ, శ్రీకాంత్ రెడ్డి ప్రోత్సాహం ధ్రువ విజయానికి పునాదులయ్యాయి. ఇప్పుడు రంజీ మైదానంలో తన సత్తా చాటాల్సిన సమయం వచ్చింది. ఈ ఎంపిక అతడి ప్రయాణానికి ముగింపు కాదు.. మరింత ఉన్నత స్థాయికి ఎదిగే కొత్త ఆరంభం. ప్రొద్దుటూరు నుంచి రంజీ జట్టు వరకు సాగిన ధ్రువ ప్రస్థానం యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

-షరీఫ్ పఠాన్,
కరస్పాండెంట్

విదేశీ సాయమంటూ దుష్ప్రచారం ఎందుకు?

- ఆరోపణలు నిరూపించాలంటూ రాహుల్ సవాల్
- ఫారెన్ సపోర్ట్ ఎవరికో బహిరంగ చర్చకు సిద్ధమా?



ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మధ్య విదేశీ సాయం అంశం రాజకీయ వివాదానికి దారితీసింది. విదేశీ శక్తుల సహాయంతోనే దేశంలో అస్థిరత సృష్టించేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మోదీ ఆరోపించిన నేపథ్యంలో రాహుల్ గాంధీ నేరుగా ఆయనకు సవాల్ విసిరారు. విదేశీ సాయంతోనే మోదీ ప్రధానమంత్రి అయ్యారని, ఇప్పటికీ అదే మద్దతుతో పదవిలో కొనసాగుతున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది.

బహిరంగ చర్చకు రాహుల్ సవాల్

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించిన రాహుల్ గాంధీ, దేశ ప్రజలకు అబద్ధాలు చెప్పడం ఆపాలని మోదీని కోరారు. విదేశీ శక్తుల మద్దతు, ఆర్థిక వ్యవస్థపై విదేశీయుల ప్రభావం, విదేశీ సామాజిక మాధ్యమాల అండతోనే మోదీ రాజకీయంగా కొనసాగుతున్నారని ఆరోపించారు. ఈ అంశాలపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలని ప్రధానినిసవాల్ చేశారు.తనకు తెలిసినవిషయాలపై చర్చించేందుకు మోదీ భయపడుతున్నారని కూడా వ్యాఖ్యానించారు.

మోదీ విమర్శలకు రాహుల్ కౌంటర్

అక్టోబర్ 31న గుజరాత్‌లో జరిగిన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ, దేశాన్ని అస్థిరపరిచేందుకు కొన్ని శక్తులు తప్పుడు ప్రచారం, వదంతులను వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపించారు. అభివృద్ధికి సహకరించాల్సిన ప్రతిపక్షాలు అడ్డంకులుగా మారాయని విమర్శించారు. విదేశాల్లో ఎవరిని కలుస్తున్నారు? భారత్‌కు వ్యతిరేక శక్తుల మద్దతు ఎవరికి ఉంది? అనే అంశాలను ప్రజలు గుర్తించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నేతల విదేశీ పర్యటనలపైనా పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో రాహుల్ బహిరంగ చర్చకు సవాల్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

సహజ వనరుల విద్యుత్తే దేశ ఆర్థిక భద్రతకు రక్షణ



పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గత పదేళ్లుగా భారత్ సూర్యరశ్మి, గాలి ద్వారా విద్యుత్ తయారుచేసే రంగాల్లో పెట్టుబడులు పెట్టడం వల్ల సంక్షోభ ప్రభావం తగ్గిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కోసం ఇతరదేశాలపై ఎక్కువగా ఆధారపడితే ఎప్పుడైనా ఇబ్బందులు తప్పవని, అందుకే మన విద్యుత్ అవసరాలను మనమే తీర్చుకునేలా ఎదగాలని సూచించారు.ప్రతి ఇంట్లో సోలార్ విద్యుత్ అందుబాటులోకి రావాలి. సామాన్యులు తమ స్కూటీ, బైక్, కార్లను సూర్యరశ్మితో తయారైన విద్యుత్‌తో ఛార్జ్ చేసుకోవాలి. రైతులు, పాడి పరిశ్రమలకు కూడా ఇది ఉపయోగపడాలి. ఈ రంగంలో 2030 నాటికి సుమారు 220 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవకాశాలున్నాయని తెలిపారు. ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, ఆసుపత్రుల్లోనూ సోలార్ విద్యుత్ వినియోగం పెంచాలని, రాష్ట్రాలు, స్థానిక సంస్థలు ఈ దిశగా పోటీపడాలని పిలుపునిచ్చారు.



అగస్త్యేశ్వరుడి సన్నిధిలో వైభవంగా మిరవరి

ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం స్వామి, అమ్మవార్ల మిరవరి వేడుక భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు ఆలయ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి దైవాశీస్సులు పొందారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సందడిని సంతరించుకుంది. ఈ వేడుకలో ఆలయ కార్యనిర్వహణాధికారి కే.వి. రమణ, చైర్మన్ వంగల నారాయణరెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



సముద్రంలో ఐదుగురు మత్స్యకారులు గల్లంతు

చీరాల మండలం వాడరేవు తీరంలో ఐదుగురు మత్స్యకారుల అదృశ్యం కలకలం రేపుతోంది. ఈనెల 29న ఏరిపిల్లి రమణ, సూరాడి పోల్‌రాజు, గరికిన కోదండ, మడదజగ్గారావు, అప్పారావు చేపల వేట కోసం సూరిబాబుకు చెందిన బోటులో సముద్రంలోకి వెళ్లారు. నిర్ణీత సమయానికి తీరానికి చేరుకోవాల్సిన బోటు గడువు దాటినా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడంతో వారి ఆచూకీ తెలియకపోవడం మరింత కలవరపాటుకు గురిచేసింది. దీంతో బోటు యజమాని సూరిబాబు మెరైన్ సీఐ రమేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు కోస్ట్‌గార్డ్‌కు సమాచారం అందించి సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. తమ వారి క్షేమ సమాచారం కోసం కుటుంబాలు తీరంలో ఎదురుచూస్తున్నాయి.



వర్షంలోనూ ప్రచారం.. అభివృద్ధిపై అనిత హామీ!

వర్షం కురుస్తున్నా వెనక్కి తగ్గకుండా హోంమంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట పట్టణంలోని 7వ సెగ్మెంట్‌లో కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ప్రజల స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేసిన అనిత, పాయకరావుపేట అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటికే ప్రధాన రహదారి నిర్మాణ పనులు చేపట్టామని, పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశామని తెలిపారు. దుర్గా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడంతో పాటు రామాలయం, కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ పార్కు అభివృద్ధితో పాటు దుర్గా, ఇందిరా, రాజీవ్ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని స్పష్టం చేస్తూ, స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

పరవాడలో కూటమి గెలుపుపై పంచకర్ల సమీక్ష

పరవాడ మండలంలో స్థానిక ఎన్నికల ప్రచారం, విజయ వ్యూహాలపై జనసేన ఎమ్మెల్యే, ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు సమీక్ష నిర్వహించారు. నవంబర్ 2న పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని పరవాడలో ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన ఈ సమావేశానికి MPTC, ZPTC అభ్యర్థులతో పాటు జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఏ విధంగా సాగుతోంది? ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది? అనే అంశాలపై అభ్యర్థులు, నాయకులతో చర్చించారు. ప్రతి గ్రామంలో మూడు పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేయాలని, విభేదాలకు తావులేకుండా కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పంచకర్ల సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.



బీసీలకు అన్యాయం.. కుటుంబానికే పదవులా?

ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ పదవి విషయంలో బీసీలకు రాజకీయ అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. తన సోదరుడు రాఘవరెడ్డికి చైర్మన్ పదవి దక్కించేందుకే రిజర్వేషన్ల నుంచి ఎన్నికల ప్రక్రియ వరకు అనుకూలంగా మలుచుకున్నారని విమర్శించారు. బీసీలకు సమర్థ నాయకత్వం లేదన్న అభిప్రాయాన్ని ప్రభుత్వానికి లేఖ ద్వారా తెలిపారని ఆరోపిస్తూ, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. ఓటర్ల జాబితాలో రాఘవరెడ్డి పేరు నమోదు, నామినేషన్ల అడ్డంకులు, ఏకగ్రీవాల వెనుక పరిణామాలపై కలెక్టర్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.6 కోట్ల భూమి వ్యవహారంతో పాటు ఎగ్జిబిషన్ ఆదాయం, మున్సిపల్ ప్లాట్ల విక్రయాలపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు వైసీపీ పోరాడుతుందని ప్రకటించారు.



దివ్యాంగులకు అండగా మున్సిపల్ యంత్రాంగం

ప్రొద్దుటూరు పురపాలక సంఘం దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ చేసేందుకు ప్రత్యేక చొరవ చూపింది. సోమవారం ఒక్కరోజే 204 మందికి సదరం ధ్రువీకరణ పత్రాల వైద్య పరీక్షల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్లు బుక్ చేసింది. వీరిలో 104 మందికి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో, 71 మందికి కడప రిమ్స్‌లో, మరో 29 మందికి ఇతర ఆసుపత్రుల్లో పరీక్షలకు అవకాశం కల్పించింది. కార్యాలయాల చుట్టూ తిరగలేని దివ్యాంగుల ఇళ్లకు సైతం సిబ్బంది వెళ్లి స్లాట్లు నమోదు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యమన్నారు. సదరం సర్టిఫికెట్ల ప్రక్రియను సులభతరం చేసి, అవసరమైన సహాయం అందించాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

మున్సిపల్ కౌంటింగ్‌కు భారీ పోలీస్ బందోబస్తు

బాపట్ల జిల్లాలోని చీరాల, రేపల్లె మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపునకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు 369 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఉమామహేశ్వర్ వెల్లడించారు. వీరిలో ఇద్దరు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 21 మంది ఎస్ఐలు భద్రతను పర్యవేక్షించనున్నారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. గుర్తింపు కార్డులు ఉన్నవారికే తనిఖీల అనంతరం ప్రవేశం కల్పిస్తారు. మొబైల్ ఫోన్లు, కెమెరాలపై నిషేధం విధించారు.ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.





ఆకాశాన్నంటుతున్న విమాన టికెట్ ధరలు?


- భారీగా పెరగడంపై సుప్రీం కోర్టులో పిటిషన్
- రేట్స్ ఎక్కువగా ఉంటే ఎక్కొద్దన్న న్యాయస్థానం

దీపావళి పండుగ వేళ విమాన టికెట్ల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతుంటే..సుప్రీంకోర్టు మాత్రం నాలుగు మాటల్లో సమస్యకు పరిష్కారం చెప్పేసింది. టికెట్ ధరలు సాధారణ ధరల కంటే ఏకంగా 700 శాతం పెరిగాయని, ప్రైవేటు విమానయాన సంస్థల దోపిడీని అడ్డుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యవసర విచారణకు పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. విమాన ప్రయాణం నిత్యావసర సేవగా మారిందని, ఇష్టానుసారంగా ధరలు పెంచడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని వాదించారు. అంతే.. పిటిషన్ విన్న జస్టిస్ విక్రమ్ నాథ్ స్పందిస్తూ ''విమానంలో ప్రయాణించకండి'' అంటూ వ్యాఖ్యానించారు. వెంటనే తదుపరి కేసును విచారణకు తీసుకోవాలని ఆదేశించారు. టికెట్ ధరలు తగ్గించాలన్న ప్రయాణికుల ఆవేదనకు కోర్టు ఇచ్చిన ఈ సమాధానం ఇప్పుడు చర్చనీయాంశమైంది. వామ్మో.. ధరలు భరించలేకపోతే విమానం ఎక్కొద్దన్నమాట!

నిబంధనలు వస్తున్నాయట.. ధరలు తగ్గుతాయా?

పండుగలు, సెలవులు, అత్యవసర సమయాల్లో విమాన సంస్థలు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్నాయని పిటిషన్‌లో ఆరోపించారు. అక్టోబర్‌లోనే విమాన టికెట్ల ధరల నియంత్రణకు కొత్త నిబంధనలకు పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చినట్లు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. నవంబర్ 16 తదుపరి విచారణలోగా ఆ నిబంధనలను సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. మరోవైపు విమాన ఇంధనం ధరలు పెరగడం, విమానాశ్రయాల ఛార్జీలు, నిర్వహణ ఖర్చులు అధికం కావడంతో టికెట్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఇండిగో సీఈఓ విల్లీ వాల్ష్ పేర్కొన్నారు. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఇంధనానిదే సుమారు 32 శాతం వాటా. అసాధారణ పరిస్థితుల్లో టికెట్ ధరల నియంత్రణకు కేంద్రం కొత్త నిబంధనలను కూడా ప్రకటించింది. అయితే సామాన్యుడి ప్రశ్న మాత్రం ఒక్కటే..పండుగకు సొంతూరికి వెళ్లాలంటే జేబు ఖాళీ చేసుకోవాలా? ధరలు భరించలేకపోతే ప్రయాణమే మానుకోవాలా? ఇదే ఇప్పుడు ట్విస్ట్.

ఐరన్ మ్యాన్ ఛాలెంజ్‌లో నాగపూర్ బిడ్డ సత్తా



గోవాలో జరిగిన ప్రతిష్టాత్మక ఐరన్ మ్యాన్ 70.3 ఎండ్యూరెన్స్ పోటీల్లో వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన కార్వంగ కృష్ణ అసాధారణ ప్రతిభ చాటారు. ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఆయన ప్రస్తుతం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగిగా కొనసాగుతున్నారు. అత్యంత కఠినమైన ఈ పోటీలో ఎలాంటి విరామం లేకుండా ఒకే రోజులో 1.9 కిలోమీటర్ల సముద్ర ఈత, 90 కిలోమీటర్ల సైక్లింగ్, 21 కిలోమీటర్ల పరుగు పూర్తి చేసి విజయవంతంగా ఫినిషర్‌గా నిలిచారు. శారీరక దృఢత్వం, అచంచలమైన పట్టుదలతో అంతర్జాతీయ ప్రమాణాలున్న ఈ సవాలును అధిగమించిన కృష్ణ విజయంపై స్థానికులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఒకప్పుడు ప్రపంచ ఐటీ రంగానికి భారతదేశం నుంచి ప్రధాన కేంద్రంగా నిలిచిన బెంగళూరు ఇప్పుడు మరో కొత్త రాజకీయ, సామాజిక వివాదానికి వేదికగా మారుతోంది. స్థానిక కన్నడిగులకు ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలన్న డిమాండ్ క్రమంగా ఉద్యమ రూపం దాలుస్తోంది. రాష్ట్రంలోని ఐటీ, బీటీ సంస్థల్లో కన్నడ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదన్న ఆరోపణలతో కన్నడ అనుకూల సంఘాలు నేరుగా కంపెనీల కార్యాలయాల వద్దకు చేరుతున్నాయి. ఉద్యోగ నియామకాల్లో స్థానికులకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారు? సంస్థల్లో కన్నడిగుల వాటా ఎంత? అర్హతలు ఉన్నప్పటికీ స్థానిక యువతకు అవకాశాలు ఎందుకు దక్కడం లేదు? అంటూ యాజమాన్యాలను ప్రశ్నిస్తున్నాయి. కర్ణాటక రక్షణ వేదిక (కేఆర్‌వీ) అధ్యక్షుడు టీవీ నారాయణ గౌడ నాయకత్వంలో నవంబర్ 1న కన్నడ రాజ్యోత్సవం సందర్భంగా నెల రోజుల రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా బెంగళూరుతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా సంఘం కార్యకర్తలు బృందాలుగా విడిపోయి ప్రైవేటు సంస్థలను సందర్శిస్తున్నారు. కంపెనీలకు వినతిపత్రాలు అందిస్తూ స్థానిక యువతకు న్యాయమైన ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు. రాష్ట్రంలోని వనరులు, మౌలిక సదుపాయాలు, మానవ వనరులను ఉపయోగించుకుంటున్న సంస్థలు స్థానిక ప్రజల ఉపాధి ఆకాంక్షలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని వాదిస్తున్నారు. ఈ ఉద్యమం కేవలం ఉద్యోగాల కోసం చేస్తున్న సాధారణ విజ్ఞప్తిగా కనిపించడం లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో స్థానికుల వాటా ఎంత ఉండాలన్న పెద్ద చర్చకు తెరతీస్తోంది. బెంగళూరులో వేలాది ఐటీ సంస్థలు పనిచేస్తున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది ఉద్యోగులు ఇక్కడికి వచ్చి పనిచేస్తున్నారు. అంతర్జాతీయ కంపెనీలకు కూడా ఈ నగరం ప్రధాన కేంద్రంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక యువతకు అవకాశాలు పెంచాలన్న డిమాండ్ సహజంగానే రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే స్థానికులకు అవకాశాలు కల్పించాలన్న లక్ష్యం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగుల ఉపాధి భద్రత మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. కంపెనీల గేట్ల వద్ద మొదలైన ఈ నిరసన.. కర్ణాటక ఉద్యోగ విధానంపై దేశవ్యాప్త చర్చకు దారితీసే సూచనలు కనిపిస్తున్నాయి.





పక్కా లోకల్..ఐటీకి సవాల్

సాఫ్ట్ వేర్ పోస్ట్.. స్థానికులే బెస్ట్

కర్ణాటక సర్కారు వితండ వాదం | **కన్నడీగుల కొత్త నినాదం** | **వార్నింగ్‌లతో యాజమాన్యాలకు టెన్షన్** | **దేశ వ్యాప్తంగా మొదలైన అటెన్షన్**

• కంపెనీలకు వినతిపత్రాలు.. ఉద్యోగాలపై లెక్కలు చెప్పాలని డిమాండ్!

కన్నడ ఉద్యోగాల ఉద్యమం మాటలకే పరిమితం కాకుండా ఇప్పుడు ఐటీ సంస్థల కార్యాలయాల వరకు చేరింది. నవంబర్ 2న బెంగళూరులోని పలు కంపెనీలను కన్నడ రక్షణ వేదిక ప్రతినిధి బృందాలు సందర్శించి యాజమాన్యాలకు వినతిపత్రాలు సమర్పించాయి. కేఆర్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్బిగెరె వినోద్ నాయకత్వంలోని బృందం అలీ అస్కర్ రోడ్డులోని సఫీనా టవర్స్‌లో ఉన్న ఎగ్జిక్యూటివ్ సెంటర్ ఇండియా లిమిటెడ్ కార్యాలయానికి వెళ్లింది. ఈ బృందంలో శివాజీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ తన్వీర్, పులకేశినగర్ యూనిట్ అధ్యక్షుడు మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు. మరో బృందం జిల్లా అధ్యక్షుడు టీఏ ధర్మరాజ్ గౌడ నాయకత్వంలో మగడి రోడ్డులోని క్వాలిటీ ఎవాల్యుయేషన్స్ సంస్థను సందర్శించింది. కేఆర్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరభద్ర నేతృత్వంలోని మరో బృందం కేఆర్ పురంలోని బి. నారాయణపురలో ఉన్న హ్యాలెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజ్ (హెచ్‌పీఈ) కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందించింది. ఈ కార్యక్రమంలో కేఆర్ పురం నియోజకవర్గ అధ్యక్షుడు మంజునాథ్ సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు సీవీ రామన్ నగర్‌లోని బాగ్మనే టెక్ పార్క్‌ను కూడా సంఘం ప్రతినిధులు సందర్శించారు. అక్కడ ఐటీ సంస్థల తరఫున ఒక ప్రతినిధి వినతిపత్రాన్ని స్వీకరించారు. తమ డిమాండ్లకు సానుకూలంగా స్పందించినట్లు కేఆర్‌వీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ పర్యటనల్లో సంఘం ప్రధానంగా కొన్ని కీలకమైన సమాచారాన్ని కోరుతోంది. ఆయా సంస్థల్లో మొత్తం ఎంతమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు? వారిలో కర్ణాటకకు చెందినవారి సంఖ్య ఎంత? గత మూడేళ్లలో జరిగిన నియామకాల్లో స్థానికులకు ఎన్ని అవకాశాలు కల్పించారు? ఉద్యోగ ఎంపికకు ఎలాంటి అర్హతలు, ప్రమాణాలు పాటిస్తున్నారు? అర్హత కలిగిన కన్నడ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు సంస్థలు తీసుకున్న చర్యలేమిటి? వంటి వివరాలను వెల్లడించాలని కోరుతోంది. నియామకాల్లో స్థానికులకు వివక్ష ఎదురవుతోందన్న ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేస్తోంది. కేవలం ఉద్యోగ నియామకాలతోనే సమస్య పరిష్కారం కాదని, స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా పెంచాలని సూచిస్తోంది. కంపెనీలు ఉద్యోగ ప్రకటనలు, అర్హతల వివరాలు, ఎంపిక విధానాలను పారదర్శకంగా ఉంచాలని కోరుతోంది. అయితే ఇప్పటివరకు ఈ సంస్థలన్నీ స్థానికులకు ఉద్యోగాలు నిరాకరించాయని నిర్ధారించే వివరాలు బయటకు రాలేదు. సంఘం కోరుతున్న సమాచారం అందుబాటులోకి వస్తేనే వాస్తవ పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

• ఐటీ సంక్షోభానికి ప్రాంతీయ రాజకీయాల సెగ!

కర్ణాటకలో స్థానిక ఉద్యోగాల వివాదం తెరపైకి వచ్చిన సమయం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే అంతర్జాతీయ ఐటీ రంగం పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడం, ఉద్యోగుల సంఖ్యను పునర్వ్యవస్థీకరించడం, కొత్త నియామకాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించడం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. లేఆఫ్‌ల కారణంగా అనేక మంది ఉద్యోగులు ఉపాధి భద్రతపై ఆందోళన చెందుతున్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరగడం, ఆటోమేషన్, ప్రాజెక్టుల పునర్వ్యవస్థీకరణ, అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి వంటి అంశాలు ఐటీ రంగంలో ఉద్యోగ అవకాశాల స్వరూపాన్ని మార్చుతున్నాయి. ఇలాంటి సమయంలో స్థానికులకే ఉద్యోగాలివ్వాలన్న ఉద్యమం మరింత చర్చకు దారితీస్తోంది. ఒకవైపు ఉద్యోగాలు కోల్పోతున్నవారికి కొత్త అవకాశాలు కల్పించాల్సిన పరిస్థితి ఉంటే, మరోవైపు స్థానిక యువతకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్న డిమాండ్ పెరుగుతోంది. కంపెనీలకు ఉద్యోగ నియామకాలు కేవలం ప్రాంతీయ అంశం మాత్రమే కాదు. నైపుణ్యం, అనుభవం, ప్రాజెక్టుల అవసరం, వ్యయ నియంత్రణ, అంతర్జాతీయ పోటీ వంటి అనేక అంశాల ఆధారంగా జరుగుతాయి. ఈ నేపథ్యంలో స్థానికులకు అవకాశాలు పెంచాలన్న డిమాండ్‌ను ఎలా అమలు చేయాలన్నది సంస్థలకు సవాలుగా మారవచ్చు. ముఖ్యంగా ఇప్పటికే ఉద్యోగుల తొలగింపులు, కొత్త నియామకాల తగ్గింపు వంటి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న సంస్థలకు అదనపు వివాదాలు అనిశ్చితిని పెంచే ప్రమాదం ఉంది. కంపెనీల కార్యాలయాల వద్ద నిరసనలు కొనసాగితే ఉద్యోగుల్లో భయాందోళనలు ఏర్పడవచ్చు. పెట్టుబడుల కోసం బెంగళూరును పరిశీలిస్తున్న అంతర్జాతీయ సంస్థలు కూడా స్థానిక పరిస్థితులను గమనించే అవకాశం ఉంది. అయితే కన్నడిగులకు ఉద్యోగాలు కల్పించాలన్న డిమాండ్‌ను పూర్తిగా వ్యతిరేకించడం కూడా సాధ్యం కాదు. రాష్ట్రంలో చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. స్థానిక విద్యార్థులకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు విద్యాసంస్థలు, ఐటీ కంపెనీలు, ప్రభుత్వం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. స్థానిక భాష తెలిసిన ఉద్యోగులు కొన్ని విభాగాల్లో అదనపు ప్రయోజనం కలిగించవచ్చు. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా పనిచేసే ఐటీ సంస్థలకు వివిధ భాషలు, ప్రాంతాలు, దేశాల నుంచి ప్రతిభావంతులైన ఉద్యోగులు అవసరం. కాబట్టి ప్రాంతీయ ప్రాధాన్యత పేరుతో ప్రతిభకు అడ్డుకట్ట పడకూడదు. స్థానిక యువతకు అవకాశాలు కల్పించాలి.. పరిశ్రమల స్వేచ్ఛను కూడా కాపాడాలి.

• రియల్ ఎస్టేట్‌పై ప్రభావం.. బెంగళూరు ఆర్థిక వ్యవస్థకు కొత్త ముప్పా?

బెంగళూరులో ఐటీ రంగం కేవలం ఉద్యోగాల కల్పనకే పరిమితం కాదు. నగరంలోని రియల్ ఎస్టేట్, అద్దె గృహాలు, వాణిజ్య సముదాయాలు, రవాణా, హోటళ్లు, విద్యాసంస్థలు, చిన్న వ్యాపారాలు వంటి అనేక రంగాలకు ఐటీ పరిశ్రమ ప్రధాన ఆధారంగా ఉంది. వేలాది మంది ఉద్యోగులు నగరానికి రావడం వల్ల నివాస గృహాలకు డిమాండ్ పెరుగుతుంది. కంపెనీల విస్తరణతో కార్యాలయ భవనాలు, టెక్ పార్కులు, వాణిజ్య స్థలాలకు అవసరం ఏర్పడుతుంది. ఉద్యోగుల కొనుగోలు శక్తి పెరిగితే స్థానిక వ్యాపారాలకు కూడా ఆదాయం లభిస్తుంది. ఈ మొత్తం ఆర్థిక చక్రంలో ఐటీ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు ఒకవైపు ఉద్యోగాలపై అనిశ్చితి, మరోవైపు స్థానిక నియామకాల వివాదం కొనసాగితే పెట్టుబడిదారులు, ఉద్యోగులు, రియల్ ఎస్టేట్ రంగం పరిస్థితులను నిశితంగా గమనించే అవకాశం ఉంది. ఐటీ కంపెనీలు కొత్త విస్తరణ ప్రణాళికలను వాయిదా వేస్తే కార్యాలయ స్థలాల డిమాండ్‌పై ప్రభావం పడవచ్చు. కొత్త ఉద్యోగాలు తగ్గితే నగరానికి వలస వచ్చే ఉద్యోగుల సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అద్దె గృహాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల వ్యాపారంపై పరోక్ష ప్రభావం పడవచ్చు. అయితే ప్రస్తుతం కన్నడ ఉద్యోగాల ఉద్యమం కారణంగా బెంగళూరు రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిందని చెప్పడానికి ఆధారాలు లేవు. అది భవిష్యత్తులో ఏర్పడవచ్చే ప్రమాదాలపై చేసే విశ్లేషణ మాత్రమే. ఉద్యమం పరిమితంగా కొనసాగి చర్చల ద్వారా పరిష్కారమైతే పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చు. కానీ కంపెనీలపై నిరంతర ఒత్తిడి, కార్యాలయాల వద్ద ఉద్రిక్తతలు, పెట్టుబడులపై అనిశ్చితి పెరిగితే పరిస్థితి మారవచ్చు. బెంగళూరులో ఉద్యోగం పొందాలనే ఆశతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన యువత కూడా ఈ పరిణామాలను గమనిస్తున్నారు. స్థానికులకు ప్రాధాన్యత పెరిగితే తమ ఉద్యోగ అవకాశాలపై ప్రభావం ఉంటుందా? ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి ఏమవుతుంది? కొత్తగా నియామకాలు జరిగే సమయంలో ప్రాంతీయ ప్రమాణాలు ఎలా ఉంటాయి? అనే ప్రశ్నలు వారిలో తలెత్తవచ్చు. మరోవైపు కన్నడ యువతకు కూడా ఒక సందేహం ఉంది. ప్రపంచస్థాయి కంపెనీలు తమ రాష్ట్రంలో పనిచేస్తున్నప్పటికీ స్థానికులకు తగిన అవకాశాలు ఎందుకు లభించడం లేదు? ఈ ప్రశ్నకు ప్రభుత్వం, కంపెనీలు గణాంకాలతో సమాధానం చెప్పాలి.

• బీజేపీకి రాజకీయ అవకాశం.. జాతీయ స్థాయిలో ప్రభావం ఎంత?

కర్ణాటకలో కన్నడిగులకే ఉద్యోగాలివ్వాలన్న ఉద్యమం ఇప్పుడు రాజకీయ పార్టీలకు కూడా కీలక అంశంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది రెండు వైపులా సవాలుగా నిలుస్తోంది. ఒకవైపు స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న డిమాండ్‌ను సమర్థించాలి. మరోవైపు బెంగళూరు అంతర్జాతీయ ఐటీ కేంద్రంగా కొనసాగేందుకు అవసరమైన పెట్టుబడుల వాతావరణాన్ని కాపాడాలి. ఈ రెండింటిలో ఏ ఒక్కదానిపై ఎక్కువగా దృష్టి పెట్టినా రాజకీయంగా విమర్శలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితిని ప్రతిపక్ష బీజేపీ ఎలా ఉపయోగించుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. స్థానికుల ఉద్యోగ హక్కుల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంతో పాటు, ఐటీ కంపెనీలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్న అంశాన్ని కూడా ముందుకు తీసుకెళ్లే అవకాశం బీజేపీకి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం కన్నడిగులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏమిటని ప్రశ్నించవచ్చు. కంపెనీల నియామకాలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంది? స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక ఉందా? ఐటీ పరిశ్రమలో కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు ఏం చేస్తోంది? అనే ప్రశ్నలతో అధికార పార్టీని ఇరుకున పెట్టవచ్చు. అయితే బీజేపీ కూడా స్థానికుల ఉపాధి అంశాన్ని కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం చేయకుండా ఆచరణాత్మక పరిష్కారాలను సూచించాల్సి ఉంటుంది. ఈ వివాదం కర్ణాటకకే పరిమితం కాకపోవచ్చు. హైదరాబాద్, చెన్నై, పుణె, గురుగ్రామ్ వంటి ఐటీ కేంద్రాల్లో కూడా స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత కల్పించాలన్న చర్చకు ఇది దారితీయవచ్చు. రాష్ట్రాల మధ్య పెట్టుబడుల పోటీ పెరుగుతున్న సమయంలో ప్రాంతీయ ఉద్యోగ విధానాలు ఎలా ఉండాలన్న ప్రశ్న జాతీయ స్థాయిలో ప్రాధాన్యం సంతరించుకోవచ్చు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ఉద్యోగుల హక్కులు, స్థానిక యువత ఉపాధి, కంపెనీల నియామక స్వేచ్ఛ, పెట్టుబడిదారుల విశ్వాసం.. వీటన్నింటినీ సమన్వయం చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. కర్ణాటక ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కారం చూపుతుందా? కన్నడ సంఘాలు తమ నెల రోజుల ఉద్యమాన్ని మరింత విస్తరిస్తాయా? ఐటీ సంస్థలు స్థానిక నియామకాలపై గణాంకాలను వెల్లడిస్తాయా? బీజేపీ ఈ అంశాన్ని రాజకీయంగా ఎంతవరకు ఉపయోగించుకుంటుంది? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

• ముఖ్యమంత్రి విజ్ఞప్తి.. అయినా వెనక్కి తగ్గని సంఘాలు!

కన్నడిగులకు ఉద్యోగాలు కల్పించాలన్న డిమాండ్‌పై ముఖ్యమంత్రి దీకే శివకుమార్ ఇప్పటికే స్పందించారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కడం లేదన్న ఫిర్యాదులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టం చేశారు. బెంగళూరులోని ఐటీ, బీటీ రంగాల్లో కన్నడ మాతృభాష కలిగిన స్థానికులను నియామకాల్లో పక్కన పెడుతున్నారన్న ఆరోపణలను ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు. రాష్ట్ర యువత హక్కులు, గౌరవం, ఉపాధి అవకాశాలు తమ ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని ప్రకటించారు. ఉద్దేశపూర్వకంగా స్థానిక యువతకు అన్యాయం చేస్తున్నట్లు ఏ ప్రైవేటు సంస్థపైనా నిర్ధారణ అయితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ అంశాన్ని ప్రభుత్వం నేరుగా పరిశీలిస్తుందని, అవసరమైన చర్యలు చేపడుతుందని హామీ ఇచ్చారు. అయితే ఇదే సమయంలో కన్నడ అనుకూల సంఘాలకు ముఖ్యమంత్రి ఒక కీలక విజ్ఞప్తి చేశారు. ఐటీ, బీటీ కంపెనీల కార్యాలయాలకు నేరుగా వెళ్లవద్దని, ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని హెచ్చరించారు. ఇలాంటి సమస్యలను చర్చల ద్వారా, చట్టపరమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం స్థానికుల ప్రయోజనాలను కాపాడేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తి వెనుక ఐటీ రంగానికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్న ఆలోచన కూడా కనిపిస్తోంది. ఎందుకంటే బెంగళూరు అంతర్జాతీయ పెట్టుబడులకు కీలక కేంద్రం. కంపెనీల కార్యాలయాల వద్ద నిరసనలు, యాజమాన్యాలపై ఒత్తిడి, ఉద్యోగులలో భయాందోళనలు పెరిగితే పెట్టుబడిదారుల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడే అవకాశం ఉంటుంది. అయితే ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేసినప్పటికీ కేఆర్‌వీ కార్యకర్తలు తమ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. వివిధ కంపెనీలను సందర్శించి వినతిపత్రాలు అందిస్తున్నారు. తమ ఉద్యమం వ్యక్తిగత సంస్థలను లక్ష్యంగా చేసుకోవడానికి కాదని, ఉద్యోగ నియామకాల్లో స్థానికులకు ఎదురవుతున్న సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు సూచించడమే లక్ష్యమని సంఘం చెబుతోంది. ఈ ప్రచారం ద్వారా సేకరించిన వివరాలను సంబంధిత కంపెనీలు, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తామని వెల్లడించింది. ఇక్కడే ప్రభుత్వానికి కొత్త సవాలు ఎదురవుతోంది. ఒకవైపు స్థానికుల ఉద్యోగ హక్కులను కాపాడాలన్న రాజకీయ బాధ్యత, మరోవైపు ఐటీ పరిశ్రమకు అనవసరమైన ఒత్తిడి కలగకుండా చూడాల్సిన ఆర్థిక బాధ్యత ఉన్నాయి. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం అంత సులభం కాదు. ప్రభుత్వం చర్చల మార్గం సూచిస్తుంటే.. సంఘాలు క్షేత్రస్థాయిలో కంపెనీలను ప్రశ్నించడం ఉద్యమానికి కొత్త మలుపు తీసుకొచ్చింది.





చొక్కా రెట్టలు మడిచారు.. కాలర్ ఎగరేశారు.. ప్రత్యర్థులకు సవాళ్లు విసిరారు! పులివెందుల గడ్డపై ఎవరు ఎదురొచ్చినా తగ్గేది లేదంటూ ఎన్నికలకు ముందు రణగర్జన చేశారు. కానీ పోలింగ్ రోజు సీన్ మారిపోయింది. సవాళ్లు విసిరిన నాయకుడు ఘర్షణలకు దూరంగా ఉంటూ నిరసన బాట పట్టారు. వ్యక్తులతో తలపడాల్సిన చోట వ్యవస్థలనే నిలదీశారు. 80 పోలింగ్ కేంద్రాల్లో 70 చోట్ల తమ ఏజెంట్లను అనుమతించలేదని ఆరోపించారు. రీపోలింగ్ డిమాండ్ చేశారు. రోడ్డుపై బైఠాయించి ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగం తీరును ప్రశ్నించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో రాక.. డీఐజీతో వివాదం.. అర్ధరాత్రి వాహనాల దహనం.. చైర్‌పర్సన్ అభ్యర్థి వాహనంపై దాడి ఆరోపణలు.. జాతీయ మీడియా కెమెరాల ధ్వంసం.. ఇలా పులివెందుల పోలింగ్ రాజకీయ రణరంగంగా మారింది. మరి ముందురోజు మడిచిన చొక్కా రెట్టలు పోలింగ్ రోజు ఎందుకు కనిపించలేదు? జగన్ వ్యూహం మార్చారా? కూటమిని రాజకీయంగా ఇరుకున పెట్టేందుకు సంయమనం పాటించారా? సొంత కంచుకోటలో గెలుపోటముల కంటే రాజకీయ ప్రతిష్ఠకే ప్రాధాన్యమిచ్చారా? ఓట్ల పోరును అభిప్రాయాల యుద్ధంగా మార్చిన జగన్.. ఈ రాజకీయ ఎత్తుగడలో పైచేయి సాధించారా?

- నిరసనలతో జగన్ మాస్టర్ స్ట్రోక్
- జాతీయ రాజకీయాల్లో మొదలైన హైప్
- ఎన్నికల కమిషన్ తీరుపై గరం గరం
- ఇండియా కూటమికి మద్దతుగా వైసీపీ స్వరం
- పోలింగ్ సరళిపై తిరుగుబాటు గళం
- కూటమిలో గందరగోళం



అదిరిన అజిటేషన్..

పొలిటికల్ సెన్సేషన్

రాజకీయాల్లో ఒక్కోసారి నాయకుడు మాట్లాడే మాటల కంటే పాటించే మౌనం ఎక్కువ చర్చకు దారితీస్తుంది. ప్రత్యర్థులకు విసిరే సవాళ్ల కంటే, ఆ సవాళ్లను ఎదుర్కొనే సమయంలో ఎంచుకునే మార్గమే రాజకీయ వ్యూహాన్ని బయటపెడుతుంది. పులివెందుల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యవహరించిన తీరు ఇప్పుడు రాజకీయ పర్గాల్లో ఆసక్తికర చర్చకు కారణమవుతోంది. ఎన్నికలకు ముందు ఆయన ప్రదర్శించిన దూకుడు ఒక ఎత్తయితే... పోలింగ్ రోజు అనుసరించిన పద్ధతి మరో ఎత్తుగా కనిపించింది. ప్రత్యర్థులు వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధమంటూ చొక్కా రెట్టలు చూపించారు. స్లీవ్స్ ఆల్రెడీ మడిచి ఉన్నాయంటూ హెచ్చరికలు జారీ చేశారు. కాలర్ ఎగురేస్తూ సవాళ్లు విసిరారు. పోలింగ్ రోజున తాను పులివెందులలోనే ఉంటానని ప్రకటించారు. ఎవరొస్తారో రండి అంటూ ప్రత్యర్థి శిబిరానికి బహిరంగ సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యల వెనుక కార్యకర్తల్లో ధైర్యం నింపాలన్న ప్రయత్నం కనిపించింది. ప్రత్యర్థి పార్టీలకు హెచ్చరికలు పంపాలన్న రాజకీయ దూకుడు కనిపించింది. తన సొంత నియోజకవర్గంలో పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తానన్న సంకేతం కనిపించింది. అయితే పోలింగ్ రోజు మాత్రం ఆయన వ్యవహారశైలిలో స్పష్టమైన మార్పు కనిపించింది. ముందురోజు ఘర్షణలకు సిద్ధమన్న సంకేతాలిచ్చిన నాయకుడు, పోలింగ్ వేళ వ్యక్తిగత తగాదాలకు దూరంగా ఉంటూ ఎన్నికల నిర్వహణను ప్రశ్నించారు. అధికారుల తీరుపై విమర్శలు చేశారు. రీపోలింగ్ కోరారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అంటే ప్రత్యర్థులతో నేరుగా తలపడటం కంటే ఎన్నికల వ్యవస్థను నిలదీయడానికే ప్రాధాన్యం ఇచ్చారు. ఇది పరిస్థితుల ప్రభావంతో తీసుకున్న నిర్ణయమా? లేక రాజకీయంగా ప్రయోజనం కలిగించే మరో మార్గాన్ని ఎంచుకున్నారా? అన్నదే ఇప్పుడు అసలు చర్చ. చొక్కా రెట్టలు మడిచిన నాయకుడు.. పోలింగ్ రోజు నిరసన బాట పట్టడం వెనుక రాజకీయ లెక్కలున్నాయా? అన్న ప్రశ్న పులివెందుల పరిణామాలకు కేంద్రబిందువుగా మారింది.

• పోలింగ్‌కు ముందు పరిణామాలు.. పులివెందులలో ఉద్రిక్తతలు!

